WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం, అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036, 9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

RNI: APTEL/2020/79173 జాతీయ తెలుగు దినపత్రిక
www.swarnasagaram.com

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 90 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | బుధవారం 20 మే 2026 | వెల : 2-00

## ఆధ్యాత్మిక వైభవంతో అలరించిన
# మహాలక్ష్మి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

### హాజరైన రాజకీయ, సినీ ప్రముఖులు

స్వర్ణసాగరం, వాకాడు, మే 19:
వాకాడు మండలం గొల్లపాలెం గ్రామం మంగళవారం ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడింది. ఆలయ ధర్మకర్త మాజీ ఏఎంసీ చైర్మన్ మనోజ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా కొనసాగాయి. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, హారతుల మధ్య దేవాలయ ప్రాంగణం దివ్యక్షేత్రాన్ని తలపించింది. అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు, మహా మంగళహారతులు భక్తులను ఆధ్యాత్మిక పరవశ్యంలో ముంచెత్తాయి. అనంతరం జరిగిన కుంభాభిషేక మహోత్సవం భక్తి భావాలను మరింత పరిపుష్టం చేసింది. వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ వేడుకలకు సినీ నటి హెబ్బా పటేల్ హాజరుకావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె రాకతో ఉత్సవ ప్రాంగణం సందడిగా మారగా, యువత పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రసిద్ధ గాయకులు శ్రీకృష్ణ, దామిని, సాహిత్య చాగంటి, గానాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. చెన్నైకి చెందిన శక్తి ఈవెంట్ ఆధ్వర్యంలో డీ ఆర్టిస్టు దిలీప్, సర్వరి, నృత్య బృంధం వారి నృత్యాలతో సందడి చేశారు. యాంకర్లు దీప్తి నల్లమత్తు, హనీ వడ్డీ వారి వాఖ్ఛాతుర్యంతో అలరించారు. మనోజ్‌కుమార్‌రెడ్డి బావ సినీ యాక్టర్ చిన్నా ప్రతి ఏటా ఉత్సవాలను యరింత ఘనంగా నిర్వహిస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమానికి గూడూరు శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ, పారిశ్రామికవేత్త తానంకి నానాజీ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యులు శ్రీపతి బాబు, వైసీపీ నేతలు, నేదురుమల్లి




రాంకుమార్‌రెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, కొడవలూరు భక్తవత్సల రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని వారు పేర్కొన్నారు. ఉత్సవాల్లో వాకాడు మండల టీడీపీ అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, వ్యాపారవేత్త సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, బీజేపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి దోషకాయల కృష్ణమూర్తి, తూపిలి సాగునీటి సంఘం అధ్యక్షులు తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి కుంచం దయాకర్, ద్వారకాతిరుమల ఆలయ ట్రస్టుబోర్డు సభ్యురాలు బత్తిన ప్రమీల, కోట మైనారిటీ నాయకులు జలీల్ అహ్మ ద్ తదితర ప్రముఖులు పాల్గొ న్నారు. అలాగే వాకాడు, కోట, చిట్టమూరు మండ లాల కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తజనాలు భారీ సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు. భక్తి, భవ్యత,




సాంస్కృతిక వైభవం సమ్మిళితమైన ఈ బ్రహ్మోత్సవాలు గొల్లపాలెం గ్రామానికి ప్రత్యేక ఆధ్యాత్మిక గుర్తింపును తీసుకొచ్చాయని గ్రామ స్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

---



### పాలమూరుకు సరే అని..
## నల్లమలసాగర్ సాకారం చేసుకోండి!

- పోలవరం- నల్లమలసాగర్‌కు 123 టీఎంసీల నికర జలాలకు పూచీ
- కేంద్ర జల సంఘం ప్రజంటేషన్
- నదుల అనుసంధానానికి కీలకమని సూచన
- ప్రాథమికంగా విభేదించిన ఏపీ అధికారులు

3

---

## తీరం మనదే..
# వేటా మనదే!

- మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- వరుసగా రెండో ఏడాది ‘మత్స్యకారుల సేవలో..’
- 1,30,796 కుటుంబాల ఖాతాల్లో రూ.262 కోట్ల జమ
- బీసీలతో తెదేపాకు దశాబ్దాల అనుబంధం
- తుమ్మలపెంట సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



నెల్లూరు/అమరావతి, స్వర్ణసాగరం

సముద్రంలో చేపలవేట సాహసంతో కూడిన పని. ప్రాణాలను పణంగా పెట్టి, రోజుల తరబడి వేట సాగిస్తారు. అలా చేయాలంటే ఎంతో గుండెధైర్యం కావాలి. కానీ ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో వేట నిషిద్ధం. ఈ కాలంలో అండగా ఉండాలనే ప్రభుత్వం ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.20వేల ఆర్థికసాయం అందిస్తోంది. ఇది మత్స్యకారుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత. ‘తీరం మనదే.. బోటూ మనదే.. వేటా మనదే.. ఇదే సీబీఎన్ మాట. రాజీ లేదు. వేరెవరినీ రానిచ్చేది లేదు. ఎవరికోసమో మన జీవనోపాధి కోల్పోవడమేంటి? మన తీరంపై మనకే హక్కులు. పొరుగు - మిగతా3లో

---



## మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

- ఐదు రోజుల్లోనే రెండోసారి..
- లీటరు పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసల పెంపు
- హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.111.88
- డీజిల్ ధర రూ.99.89కు చేరిక
- పెంపు మన దేశంలోనే తక్కువ: బీజేపీ

2

---

## నేడు మెడికల్ షాపుల బంద్



- రాష్ట్రంలో 45 వేల మెడికల్ షాపులు మూసివేత
- ఉదయం నుంచి రాత్రి వరకు రిటైల్ మందుల దుకాణాలు పూర్తిగా మూతపడనున్నాయి

3

---

## భారత్‌లో తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

- శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని విమర్శ
- పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారు.

2



# ధరల కట్టడికి త్వరలో చర్యలు

అసలే నిత్యావసరాల ధరల మంట.. ఆపై పెట్రో పోటుతో అల్లాడుతున్న ప్రజలకు మరో గండం పొంచి ఉన్నట్టే కనిపిస్తోంది. పశ్చిమాసియా యుద్ధం... ఆఖరికి బ్యాంకుల్లో రుణాలు తీసుకునే వారినీ వదిలేట్లు లేదు. కొండెక్కిన క్రూడాయిల్ సెగతో ద్రవ్యోల్బణం ఎగబాకుతుండటం... రూపాయి అంతకంతకూ పడిపోతున్న నేపథ్యంలో త్వరలోనే రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లు పెంచొచ్చనేది ఆర్థిక నిపుణుల అంచనా. ఇదే జరిగితే గృహ, వాహన, పర్సనల్, కార్పొరేట్ లోన్లు భారమవుతాయి. దీంతో నెలవారీ వాయిదాలు (ఈఎంఐలు) ఎగబాకుతాయి. మరోపక్క, వడ్డీ రేట్ల పెంపుతో వినియోగం తగ్గి.. ఎకానమీ వృద్ధి మరింత మందగించే అవకాశాలున్నట్లు విశ్లేషకులు డేంజర్ బెల్స్ మోగిస్తున్నారు! మోదీ పొదుపు వార్నింగ్ తర్వాత అటు బంగారం, వెండిపై సుంకాల మోత, దిగుమతి ఆంక్షలు... పెట్రో వాతతో షాకిచ్చిన సర్కారుకు ఇక ఆర్‌బీఐ కూడా జతయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 5న తీసుకోబోయే సెంట్రల్ బ్యాంక్ పాలసీ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. ముడిచమురు బ్యారెల్ 100 డాలర్ల పైకి దూసుకెళ్లి, గత రెండున్నర నెలలుగా దాదాపు అదే స్థాయిలో కదలాడుతోంది. మన బంగారం, క్రూడ్ అవసరాల్లో 85 శాతం మేర దిగుమతులపైనే ఆధారపడుతుండటంతో దిగుమతుల బిల్లు భారమై రూపాయి మరింత బక్కచిక్కింది. ప్రస్తుతం సరికొత్త ఆల్‌టైమ్ కనిష్ఠం 96.60కి పడిపోయింది. విదేశీ ఇన్వెస్టర్ల తిరోగమనంతో డాలర్లు ఎగిరిపోతున్నాయి. ఈ విపత్కర పరిణామాలతో మన ఫారెక్స్ నిల్వలు కరిగిపోతున్నాయి. మరోపక్క, పెట్రోలు, డీజిల్ ధరల పెంపుతో (వారంలోపే దాదాపు రూ.4 చొప్పున రెండు సార్లు) ద్రవ్యోల్బణం ఎగబాకుతోంది. దీంతో ఆర్‌బీఐ మళ్లీ వడ్డీరేట్లు పెంచవచ్చని ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత బాండ్ మార్కెట్ ట్రెండ్.. రేట్ల పెంపు సిగ్నల్ ఇస్తున్నట్లు చెబుతున్నారు. బాండ్ రాబడులు (ఈల్డ్స్) గత రెండు నెలల్లో ఎగబాకడం (10 ఏళ్ల ప్రామాణిక ట్రెజరీ బాండ్ ఈల్డ్ 6.25 శాతం నుంచి 7.06 శాతానికి జంప్ చేసింది) చూస్తుంటే.. చమురు ధరల సెగతో ద్రవ్యోల్బణం ఎగబాకి, రూపాయి మరింత బలహీన పడుతుందన్న ఆందోళనలకు అద్దంపడుతోందని విశ్లేషిస్తున్నారు.

**గతేడాది 1.25 శాతం తగ్గింపు...**

ధరలు అదుపులో ఉండటంతో... జీడీపీ వృద్ధికి ఊతమిచ్చేందుకు 2025 ఫిబ్రవరి నుంచి డిసెంబర్ వరకు ఆర్‌బీఐ నాలుగు విడతల్లో రెపో రేటును 1.25 శాతం తగ్గించింది. దీంతో ఈ కీలక పాలసీ రేటు 6.5 శాతం గరిష్ఠ స్థాయి నుంచి 5.25 శాతానికి చేరింది. బ్యాంకులు కూడా దీన్ని రుణగ్రహీతలకు బదలాయించడంతో అన్ని రకాల రుణాలపై వడ్డీ రేట్లు దిగొచ్చాయి. కానీ పశ్చిమాసియా యుద్ధం మొదలైన తర్వాత క్రూడ్ రేట్లు భగ్గుమనడం, రూపాయి భారీ పతనం, ద్రవ్యోల్బణం పెరుగుదల రిస్క?లతో ఆర్‌బీఐ అప్పటి నుంచీ పాలసీ రేట్లను యథాథంగానే కొనసాగిస్తోంది. అవసరమైతే రేట్లను తగ్గించేలా తటస్థ (న్యూట్రల్) విధానాన్ని కూడా మార్చలేదు. తీరా చూస్తే, ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. కాగా, చివరిసారిగా ఆర్‌బీఐ రెపో రేటును 2023 ఫిబ్రవరిలో పావు శాతం పెంచింది.

**ఈ ఏడాది పెంపు.. రెండు విడతలు**

రూపాయి పతనం, ధరల పెరుగుదలకు అడ్డకట్ట పడాలంటే తదుపరి పాలసీ భేటీలో వడ్డీ రేట్ల పెంపు 'దాదాపు అనివార్యం'గా కనిపిస్తోందని బ్రోకరేజి దిగ్గజం ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర?వసెస్ తాజా నివేదికలో పేర్కొంది. ఒకవేళ క్రూడ్ రేటు 100 డాలర్ల పైనే కొనసాగితే (ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ 110 డాలర్ల వద్ద ట్రేడవుతోంది) పాలసీ భేటీతో సంబంధం లేకుండా సడన్‌గా వడ్డీ రేట్ల షాక్‌కు కూడా అవకాశం ఉందంటోంది. అయితే, ప్రస్తుతానికి ఆర్‌బీఐ అప్రమత్త ధోరణితోనే వ్యవహరించవచ్చని, రానున్న పాలసీలో సమీక్షలో తక్షణం వడ్డీ రేట్ల పెంపు వంటి కఠిన చర్యలకు దిగే అవకాశం లేదని చాయిస్ వెల్త్ సీఈవో నికుంజ్ సరాఫ్ అభిప్రాయపడ్డారు. రానున్న రెండు మూడు నెలల్లో ద్రవ్యోల్బణం గణాంకాలు, స్థూల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చర్యలు ఉంటాయన్నారు. ఇంధన సెగకు తోడు ఎల్‌నినో (వర్షాభావం) రిస్క?కల నేపథ్యంలో ద్రవ్యోల్బణం మరింత ఎగబాకడంతో పాటు ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉందని హెచ్‌ఎస్‌బీసీ చెబుతోంది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను మరీ తీవ్రంగా పెంచకపోవచ్చని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్వితీయార్ధంలో రెండు విడతల్లో అర శాతం రెపో రేటు పెంపునకు ఆస్కారం ఉందని పేర్కొంది.

**ధరాఘాతం.. ఎల్‌నినో ఆజ్యం!**

వాణిజ్య గ్యాస్ రేట్ల భారీ పెరుగుదలతో ఇప్పటికే ఆహార ధరలకు రెక్కలొచ్చాయి. మరోపక్క, అధిక క్రూడ్ ధరల కారణంగా ముడి వస్తువులు భారంగా మారడంతో ఎఫ్‌ఎంసీజీ, వాహన, వినియోగ వస్తువులు, ఎలక్ట్రానిక్స్ సహా పలు కంపెనీలు రేట్ల పెంపునకు తెరతీశాయి. ఇక తాజాగా పెట్రో పోటు.. ఇంధన ద్రవ్యోల్బణాన్ని మరింత ఎగదోస్తోంది. అన్ని రంగాల్లో రవాణా, ఇన్‌పుట్ వ్యయాలు పెరగడంతో నిత్యావసర వస్తువులు చుక్కలు చూపిస్తున్నాయి. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరగా, టోకు ధరల ద్రవ్యోల్బణం భగ్గుమంది. మార్చిలో 3.88 శాతం నుంచి ఏప్రిల్‌లో ఏకంగా 48 నెలల గరిష్ఠ స్థాయికి (8.3 శాతం) దూసుకెళ్లింది. రూపాయి పతనం ఇలాగే కొనసాగితే, రాబోయే వారాల్లో విడతల వారీగా మరో రూ.10 పెంపు తప్పకపోవచ్చని అంచనా వేసింది. దీనివల్ల జూన్ నాటికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.4 శాతానికి ఎగబాకే రిస్కు ఉందని తెలిపింది. ఇదే జరిగితే ఆర్‌బీఐ నిర్దేశిత 4 శాతం (2% అటుఇటుగా) పరిమితిని దాటేసే ప్రమాదం ఉంది. ఇదిలా ఉంటే, పులిమీద పుట్రలా ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ఆందోళనలు వణికిస్తున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో వర్షాలు గనుక సరిగ్గా కురవకపోతే ఆహార ధరలు మరింత భగ్గుమంటాయని హెచ్‌ఎస్‌బీసీ హెచ్చరించింది.

గడిచిన ఏడాది కాలంలో గృహ రుణాలపై వడ్డీ రేటు 9.5% గరిష్ఠ స్థాయి నుంచి 7.5% వరకు దిగొచ్చింది. ఆర్‌బీఐ గనుక త్వరలో పావు శాతం రెపో రేటును పెంచి, దీన్ని బ్యాంకులు నేరుగా కస్టమర్లకు వర్తింపజేస్తే... హోమ్‌లోన్ వడ్డీ రేటు కూడా ఎగబాకుతుంది. వడ్డీ రేట్ల పెంపునకు ముందు ఒక వ్యక్తి 20 ఏళ్ల కాలానికి 7.75% వడ్డీ రేటుతో రూ.50 లక్షల రుణం తీసుకుంటే, ఈఎంఐ రూ. 41,047 పడుతుంది. పావు శాతం వడ్డీ రేట్ల పెంపు తర్వాత ఇది రూ.41,822కు పెరుగుతుంది. అంటే, ఒక్కో ఈఎంఐపై రూ.775 అదనంగా చెల్లించాల్సి వస్తుందన్న మాట! ఒకవేళ ఈఎంఐ పెరగకుండా అలాగే కొనసాగిస్తే, రుణ వ్యవధి మరో 8--10 నెలలు పెరుగుతుంది. ఆమేరకు అధిక వడ్డీ కట్టాల్సి ఉంటుంది.

# సెప్టెంబర్‌లో భారత్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ రాక

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్?లో భారత్‌కు రానున్నారు. 2026-బ్రిక్స్ సదస్సు కోసం సెప్టెంబర్ 12-13 తేదీల్లో పుతిన్ ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ మేరకు రష్యా ప్రభుత్వ కార్యాలయం క్రెమ్లిన్ అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ ఏడాది కాలంలో పుతిన్ భారత్‌కు రావడం ఇది రెండోసారి కావడం విశేషం. 2025 డిసెంబర్?లో జరిగిన 23వ భారత్, రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఇరుదేశాల సంబంధాల బలోపేతంపై ప్రధాని నరేంద్ర మోదీతో చర్చలు జరిపారు.

అలాగే, బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరగనున్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉషకొవ్ తెలిపారు. కాగా, ఈసారి బ్రిక్స్ సదస్సుకు భారత్ నేతృత్వం వహిస్తోంది. ఈ సంవత్సరం భారతదేశ బ్రిక్స్ సదస్సుకు సంబంధించి దేశవ్యాప్తంగా అనేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తిన నేపథ్యంలో పుతిన్? భారత్?కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతేడాది బ్రిక్స్ సదస్సు బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో జరిగింది.

**ప్రధాని మోదీతో భేటీ అయిన రష్యా విదేశాంగ మంత్రి**

ఇదిలా ఉండగా, ఇటీవలే రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ భారత్?లో పర్యటించారు. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం, ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. మే 14న జరిగిన ఆ సమావేశంలో భారత్- రష్యా ద్వైపాక్షిక సహకారం, అంతర్జాతీయ పరిస్థితులు, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా పరిణామాలు వంటి కీలక విషయాల గురించి చర్చించారు. అనంతరం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో సెర్గీ లావ్రోవ్ మాట్లాడారు. చర్చల సందర్భంగా ప్రధాని మోదీ కూడా ఈ ఏడాది చివర్లో రష్యాలో పర్యటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు, వ్యూహాత్మక భాగస్వామ్య విస్తరణపై రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. భారత్‌తో తమకు ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు మాస్కో కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. "బ్రిక్స్ సదస్సు కోసం మేం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించాం. ఈ ఏడాది రష్యా పర్యటన తన వంతు అని ప్రధాని మోదీ ధ్రువీకరించారు. అత్యున్నత స్థాయి సమావేశాల కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి" అని లావ్రోవ్ పేర్కొన్నారు.



ఇక, భారత్ అధ్యక్షతన జరగనున్న 2026 బ్రిక్స్ సదస్సుకు 'బిల్డింగ్ ఫర్ రెసిలియెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టైనబిలిటీ' అనే థీమ్‌ను నిర్ణయించారు. అంటే స్థిరత్వం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం ప్రధాన లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. 2025లో బ్రెజిల్‌లోని రియో సమ్మిట్ సందర్భంగా ప్రధాని మోదీ ప్రస్తావించిన 'మానవతా దృక్పథం, ప్రజాకేంద్రిత అభివృద్ధి' భావజాలాన్నే ఈ థీమ్ ప్రతిబింబిస్తోందని బ్రిక్స్ అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది.

**బ్రిక్స్‌లో ఎన్ని దేశాలు ఉన్నాయంటే!**

బ్రిక్స్ కూటమి విషయానికొస్తే, తొలుత బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా ఈ వేదికలో భాగమవగా, ఆ తర్వాత ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, ఇండోనేషియా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా సభ్యదేశాలుగా చేరాయి. దీంతో ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో మొత్తం సభ్యదేశాల సంఖ్య 11కు చేరింది. ప్రపంచంలోని 11 దేశాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా బ్రిక్స్? ఒక ప్రభావవంతమైన కూటమిగా అవతరించింది. ప్రపంచ, ప్రాంతీయ ప్రాముఖ్యత కలిగిన సమకాలీన సమస్యలు, అలాగే ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిపాలనకు సంబంధించిన అంశాలపై సంప్రదింపులు, సహకారం కోసం ఇది పనిచేస్తుంది.

# భారత్‌కు అపాచీ హెలికాప్టర్లు, ఎం777ఏ2 హోవిట్జర్లు

భారత్ అమ్ములపొదిలో ఉన్న అపాచీ హెలికాప్టర్లు, హోవిట్జర్ ఫిరంగులకు నిర్వహణ, మద్దతుపరమైన సర్వీసులను అందించే ప్రతిపాదనలకు అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది. భారత్‌కు రూ.1,909 కోట్ల (198.2 మిలియన్ డాలర్లు) విలువైన అపాచీ హెలికాప్టర్ల పరికరాలు, సపోర్ట్ సర్వీసులను అందిస్తామని వెల్లడించింది. ఎం777ఏ2 అల్ట్రా లైట్ హోవిట్జర్ ఫిరంగుల నిర్వహణకు మద్దతును అందించే ప్రతిపాదనకూ అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించిన అంచనా వ్యయం దాదాపు రూ.2,217 కోట్లు (230 మిలియన్ డాలర్లు). భారత్ వద్దనున్న అపాచీ హెలికాప్టర్ల సర్వీసింగ్‌కు బోయింగ్ కంపెనీ, లాక్‌హీడ్ మార్టిన్, హోవిట్జర్ ఫిరంగుల సర్వీసింగ్‌కు యూకేలోని క్యుంబ్రియాకు చెందిన బీఏఈ సిస్టమ్స్ కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తాయని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది.

భారత్ మా ప్రధాన రక్షణ భాగస్వామి

**'అపాచీ హెలికాప్టర్ల ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సాంకేతిక డేటా, ప్రచురణలు, సిబ్బంది శిక్షణ,**

సహాయక సేవలను తమకు అందించాలని భారత్ కోరింది. ఇందుకోసం అమెరికా ప్రభుత్వం, కాంట్రాక్టర్ల సహాయాన్ని అభ్యర్థించింది. దీంతోపాటు ఎం777ఏ2 అల్ట్రా లైట్ హోవిట్జర్ ఫిరంగుల దీర్ఘకాలిక నిర్వహణలోనూ సహాయాన్ని అందించాలని భారత్ విన్నవించింది. ఆ ఫిరంగుల అనుబంధ వస్తువులు, విడి భాగాలు, మరమ్మతు, శిక్షణ, సాంకేతిక సహాయం, లాజిస్టిక్స్ విభాగాల్లో సహకరించాలని భారత్ కోరింది. ఈ ప్రతిపాదనలకు మేం ఆమోదం తెలిపాం. అమెరికా-భారత వ్యూహాత్మక సంబంధాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ సహకారాన్ని అందిస్తున్నాం. మేం భారత్‌ను ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాలలో రాజకీయ స్థిరత్వం, శాంతి, ఆర్థిక పురోగతికి దోహదపడే ప్రధాన రక్షణ భాగస్వామిగా భావిస్తున్నాం. దాని భద్రతను మెరుగుపర్చేందుకే ఈ సాయం చేస్తున్నాం. దీనివల్ల భవిష్యత్ ముప్పులను ఎదుర్కొనేలా భారత్ సామర్థ్యం ఇనుమడిస్తుంది. ప్రాంతీయ ముప్పులకు అడ్డుకట్ట పడుతుంది. భారత్‌కు ఈ సహాయక సేవలను అందిస్తున్న ఫలితంగా అమెరికా రక్షణ సంసిద్ధతపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడదు' అని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. భారత రక్షణ దళాల వద్ద మొత్తం 28 అత్యాధునిక అపాచీ హెలికాప్టర్లు ఉన్నాయి. వీటిలో 22 హెలికాప్టర్లు వాయుసేన వద్ద, 6 హెలికాప్టర్లు ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్ వద్ద ఉన్నాయి. అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థతో వేర్వేరు సమయాల్లో చేసుకున్న ఒప్పందాల ప్రకారం ఒక్కో హెలికాప్టర్ ధర మారుతూ వచ్చింది. తొలి 22 అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు 2015లో భారత్ - అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది. అవన్నీ 2020 నాటికే డెలివరీ అయ్యాయి. వీటన్నింటిని వాయుసేనకే అందించారు. ఇక 2025 జులైలో 3 అపాచీ హెలికాప్టర్లు, 2025 డిసెంబరులో మరో 3 హెలికాప్టర్లను భారత్ కొనుగోలు చేసింది. వీటిని ఆర్మీకి అందజేసింది. 22 అపాచీ హెలికాప్టర్ల కోసం 2015లో కుదిరిన ఒప్పందం ప్రకారం, భారత వాయుసేనకు ఒక్కో హెలికాప్టర్ సగటున రూ.678 కోట్లు పడింది. 2025 సంవత్సరం నాటికి ఈ హెలికాప్టర్ల రేట్లు గణనీయంగా పెరిగాయి. ఆ ఏడాది భారత్‌కు అమెరికా డెలివరీ చేసిన 6 అపాచీ హెలికాప్టర్ల మొత్తం విలువ దాదాపు రూ.4,168 కోట్లు (930 మిలియన్ డాలర్లు). అంటే ఒక్కో హెలికాప్టర్ ధర దాదాపు రూ.860 కోట్ల నుంచి రూ.948.5 కోట్లు ఉంటుంది. ఈ ఒప్పందంలో హెలికాప్టర్లే కాకుండా వాటి విడిభాగాలు, అత్యాధునిక లాంగ్‌బో రాడార్‌లు, హెల్‌ఫైర్ క్షిపణులు, ఆయుధ సామగ్రి, పైలట్ల శిక్షణ కూడా కలిసి ఉన్నాయి.

## మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

స్వర్ణసాగరం న్యూఢిల్లీ

దేశంలో మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. పెట్రోల్‌పై లీటరుకు 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెంచుతున్నట్టు పెట్రోలియం సంస్థలు మంగళవారం ప్రకటించాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో పెట్రోల్ రేట్లు పెంచబోమన్న ప్రభుత్వం.. అందుకు విరుద్ధంగా ఐదు రోజుల్లోనే రెండోసారి ధరలను పెంచడం గమనార్హం. ఈ నెల 15వ తేదీన పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచగా, తాజాగా మరో 90పైసల వరకు పెంచారు. దీనితో హైదరాబాద్‌లో పెట్రోల్ ధర రూ.111.88కి డీజిల్ ధర రూ.99.89కి చేరాయి. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలు, ప్రాంతాల్లో స్థానిక పన్నుల ఆధారంగా, వేర్వేరు కంపెనీల బంకుల్లో రవాణా వ్యయం ఆధారంగా ఈ పెంపులో కాస్త హెచ్చుతగ్గులు ఉంటాయి. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ రూ.98.64, డీజిల్ రూ.91.58కి చేరాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదనే సంకేతాలు వెలువడ్డాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భారీ స్థాయిలో నష్టాలు వస్తున్నాయని పెట్రోలియం కంపెనీలు పేర్కొన్నాయి. పెట్రోల్, డీజిల్‌లపై లీటర్‌కు రూ.10 చొప్పున పెంచవచ్చనే అంచనాలూ వెలువడ్డాయి. అయితే ఒక్కసారిగా పెంచితే ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమయ్యే నేపథ్యంలో దశలవారీగా పెంచాలని పెట్రోలియం కంపెనీలు సిద్ధమైనట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు సీఎన్జీ ధర కూడా కిలోకు 15వ తేదీన రెండు రూపాయలు, 17వ తేదీన ఒక రూపాయి కలిపి రూ.3 పెరిగింది. ఇలా పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు పెరగడంతో రవాణా వ్యయం పెరిగి.. దాదాపు అన్నిరకాల వస్తుసేవల ధరలు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా పశ్చిమాసియా సంక్షోభం అనంతరం ప్రపంచంలో గల్ఫ్ దేశాలు మినహా భారత్‌లో మాత్రమే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు అతి తక్కువ అని బీజేపీ పేర్కొంది. చాలా దేశాల్లో 20శాతం నుంచి 50శాతానికిపైగా పెట్రోలియం ధరలు పెరిగితే.. భారత్‌లో ఈ పెంపు కేవలం 4శాతమేనని బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి భారత ప్రభుత్వ రంగ పెట్రోలియం కంపెనీలు రోజుకు రూ.1,000 కోట్లు నష్టాలను భరిస్తూ వస్తున్నాయని, ప్రజలపై భారం వేయలేదని తెలిపారు.

## భారత్‌లో తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు. శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్ వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు. "భారీ ఆర్థిక తుపాన్ రాబోతోంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. అంత తీవ్రమైన ఆర్థిక తుపాన్ రాబోతోంది. అది ఎంతపెద్దది అంటే మీరు, నేను మన జీవితంలో ఎప్పుడూ చూడలేనంత పెద్దది. దెబ్బ ఎవరికి తగులుతుంది? అంబానీ, అదానీలకు తగలదు. వాళ్లు తమ ప్యాలెస్‌లో కూర్చుని ఉంటారు. వాళ్ల ప్యాలెస్‌ల చుట్టూ భద్రత ఉంటుంది. భారత రైతుకు, కార్మికుడికి, యువతకు, చిన్న వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుంది. ఏవైతే ఉపాధిని కల్పిస్తాయో, వాటికి నష్టం కలగనుంది. ఇప్పుడు మేం చెప్తున్నాం నెలల ముందు నుంచే నేను చెప్తున్నాను. ఆర్థిక తుపాన్ వస్తోంది, సిద్ధం కావాలి అని. ప్రజలకు భారీ దెబ్బ తగలబోతోంది, పెట్రోల్ ధరలు పెరగబోతున్నాయని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకబోతోందని చెబుతున్నాను. వాళ్లేమో (బీజేపీ) రాహుల్ గాంధీకి ఏం అవగాహన లేదని అంటున్నారు. ఇరాన్- అమెరికా మధ్య యుద్ధం చెలరేగడంతో మన ఇంధన సరఫరాలను ఇరాన్ నిలిపివేసింది. ఫలితంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. పెట్రోల్, డీజిల్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని మోదీ ప్రజలకు సలహా ఇస్తున్నారు. కానీ, మరుసటి రోజే మోదీ స్వయంగా విదేశాలకు వెళు తున్నారు."

**ప్రభుత్వాన్ని మార్చాలని ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు**

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్న రైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

**'రైతులు నాశనమవుతారు- పేదలు తుడిచిపెట్టుకుపోతారు'**

"ప్రజలు మేల్కొని రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి. మీరు ఈ ప్రభుత్వాన్ని మార్చకపోతే ఈ దేశం మనుగడ సాగించదు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ రద్దు చేస్తారు. రైతులు నాశనమవుతారు. పేదలు తుడిచిపెట్టుకుపోతారు. కానీ మోదీ, అమిత్ షా సహా దేశ నాయకులందరూ అంబానీ ఇంట్లో జరిగిన పెళ్లికి హాజరవుతుంటారు. గతంలో ప్రజలు తమ ఇంటి పొదుపును తమ ఇళ్లలోనే ఉంచుకునేవారు. అయితే, ఇప్పుడు మోదీ ఆ డబ్బును మీ జేబుల నుంచి దోచుకుని అదానీ, అంబానీలకు, తన అనుచరులకు అప్పగించారు. వారు జీఎస్టీ పేరుతో నిధులను పక్కదారి పట్టిస్తున్నారు." అని రాహుల్ గాంధీ అన్నారు. రెండు రోజుల పర్యటన కోసం ఉత్తర్‌ప్రదేశ్‌కు వచ్చిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలైన రాయ్‌బరేలీ, అమేఠీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం లఖ్?నవూ విమానాశ్రయంలో దిగిన ఆయన, అక్కడి నుంచే నేరుగా తన నియోజకవర్గమైన రాయ్‌బరేలీ వెళ్లారు. విమానాశ్రయంలో రాహుల్ గాంధీకి ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్, ఇతర నేతలు స్వాగతం పలికారు.

## 'గోల్డ్ మానిటైజేషన్ వార్తలు అబద్ధం'

దేశవ్యాప్తంగా ఉన్న దేవాలయ ట్రస్టులు, మతపరమైన సంస్థల కోసం కేంద్ర ప్రభుత్వం 'గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్' తీసుకురావాలని యోచిస్తున్నట్లు వచ్చిన వార్తలను కేంద్రం కొట్టిపారేసింది. సదరు సోషల్ మీడియా పోస్టులు, నివేదికలు పూర్తిగా అబద్ధం అని, అవన్నీ తప్పుదోవ పట్టించేవి, ఆధారం లేనివి అని స్పష్టం చేసింది. దేవాలయాల వద్ద ఉన్న బంగారు నిల్వలకు బదులుగా కేంద్ర ప్రభుత్వం గోల్డ్? బాండ్లను జారీ చేయాలని యోచిస్తోందని కొన్ని వార్తలు వచ్చాయి. ఇందుకోసం గోల్డ్ మానిటైజేషన్? (బంగారం నగదీకరణ)కు సంబంధించిన ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపిందని పేర్కొన్నాయి. అయితే అవన్నీ తప్పుడు కథనాలు అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ మంగళవారం అధికారికంగా వెల్లడించింది. అలాగే దేవాలయ గోపురాలు, తలుపులు లేదా ఇతర దేవాలయ నిర్మాణాలపై అమర్చిన బంగారు పూతలను 'భారతదేశ వ్యూహాత్మక బంగారు నిల్వలు' (స్ట్రాటజిక్? గోల్డ్? రిజర్వ్? ఆఫ్ ఇండియా)గా పరిగణిస్తారనే వార్తలను కూడా తోసిపుచ్చింది. ఇలాంటి వదంతులను, ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరింది. ధ్రువీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయడం వల్ల అనవసరమైన గందరగోళం ఏర్పడి, ప్రజలు తప్పుదోవన పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. విధానపరమైన నిర్ణయాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం కోసం ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని సూచించింది. ప్రభుత్వం విధానపరమైన ప్రకటనలను అధికారిక పత్రికా ప్రకటనలు (ప్రెస్ రిలీజ్?), గవర్నమెంట్? వెబ్?సైట్లు, ధ్రువీకరించిన పబ్లిక్ కమ్యూనికేషన్? ప్లాట్?ఫారమ్?ల ద్వారా తెలియజేస్తుందని స్పష్టం చేసింది.

**ఇంతకీ గోల్డ్ మానిటైజేషన్ అంటే ఏమిటి?**

దేవాలయాల్లో ఉన్న బంగారాన్ని బ్యాంకింగ్ వ్యవస్థలోకి తెస్తారు. బంగారం విలువకు సరిపోయేలా గోల్డ్ బాండ్లు జారీ చేస్తారు. వాటిపై వడ్డీ రూపంలో ఆదాయం అందిస్తారు. సింపుల్?గా చెప్పాలంటే 'బంగారాన్ని ఉత్పాదక ఆస్తిగా మార్చడం' లేదా 'బంగారం నగదీకరణ' చేస్తారు. భారతదేశంలో హిందూ దేవాలయాలు లేని ప్రాంతం లేదంటే అతిశయోక్తి కాదు. పూర్వం ఈ దేవాలయాలకు రాజులు, జమీందారులు మణులు, మాన్యాలు, బంగారు ఆభరణాలు ధారాళంగా విరాళాలు ఇచ్చేవారు. నేటి ఆధునిక కాలంలో ధనవంతులు భారీ ఎత్తున బంగారు అభరణాలు బహూకరించడం మనం వార్తల్లో చూస్తుంటాం. వీటికి తోడు సామాన్య భక్తులు ఇచ్చే కానుకలు కూడా భారీగానే ఉంటాయి. ఇవన్నీ దేవాలయానికి ఆదాయ వనరులుగా ఉంటాయి.

# పాలమూరుకు సరే అని.. నల్లమలసాగర్ సాకారం చేసుకోండి!

స్వర్ణసాగరం అమరావతి

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల, పోలవరం- నల్లమలసాగర్ అనుసంధానం, గోదావరి- కావేరి అనుసంధానం ప్రాజెక్టులను మేళవిస్తూ కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సాకారానికి ఆంధ్రప్రదేశ్ సహకరించి, పోలవరం- నల్లమలసాగర్ అనుసంధానాన్ని చేపట్టేందుకు అవసరమైన 123 టీఎంసీల నికర జలాలు తీసుకోవచ్చని సూచించింది. దిల్లీలో మే మొదటి, రెండో వారంలో జరిగిన రెండు సమావేశాల్లోనూ సీడబ్ల్యూసీ దీనిపై ప్రజంటేషన్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ అధికారులు ఈ వివరాలు తెలుసుకున్నా, ప్రాథమికంగా తమకు అభ్యంతరాలున్నాయని తెలిపారు. మే 1, 8 తేదీల్లో ఈ అంశంపై దిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ కార్యాలయంలో చర్చలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఇందుకు అంగీకరిస్తే ముందుకు సాగొచ్చని కేంద్ర జలసంఘం పేర్కొంది. కేంద్ర జలశక్తి కార్యదర్శి కాంతారావు సమక్షంలోనే ఈ వివరాలు వెల్లడించారు.

**ఇప్పటికే సంయుక్త కమిటీ ఏర్పాటు**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ 12 మందితో కమిటీ వేసిన సంగతి తెలిసిందే. గతేడాది జులై 16న ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కేంద్ర జలశక్తి శాఖమంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో సమావేశమై చర్చించాక ఈ కమిటీ ఏర్పాటైంది. ఇరు రాష్ట్రాల నుంచి నలుగురేసి, కేంద్రం తరఫున ముగ్గురు సభ్యులు ఉండే ఈ కమిటీకి ఛైర్మన్‌గా.. సీడబ్ల్యూసీ ఛైర్మన్ వ్యవహరిస్తున్నారు. ఈ కమిటీ తొలి భేటీ జనవరి 30న దిల్లీలో జరిగింది. మళ్లీ తదుపరి సమావేశం జరగలేదు. ఈ నేపథ్యంలో కమిటీ ఛైర్మన్‌గా ఉన్న సీడబ్ల్యూసీ ఛైర్మన్ ఇటీవలి భేటీలో ఈ ప్రతిపాదనలు ముందుకుతెచ్చారు. వీటిపై మరో సమావేశం కూడా ఉంటుందని తెలిసింది.

**పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ఆమోదానికి..**

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం నికర జలాల పునఃకేటాయింపుల మేరకు ఈ పనులు చేస్తున్నట్లు చెబుతోంది. దీనికి వ్యతిరేకంగా ఏపీ న్యాయపరంగా పోరాడుతోంది. పోలవరం నుంచి కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్న 80 టీఎంసీల్లో ఎగువ రాష్ట్రాలకు వాటా ఉంది. అందులో 35 టీఎంసీలు మహారాష్ట్ర (14), కర్ణాటక (21) ఇప్పటికే వాడుకుంటున్నాయి. మిగిలిన 45 టీఎంసీలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాగార్జునసాగర్ ఎగువన కృష్ణా బేసిన్‌లో వినియోగించుకునేందుకు గోదావరి అవార్డు సమ్మతిస్తోంది. పోలవరం ద్వారా వచ్చే ఆ 45 టీఎంసీలు పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు ఇచ్చేందుకు అంగీకరించాలన్నది సీడబ్ల్యూసీ ప్రతిపాదించిన అంశాల్లో ఒకటి. తమ రాష్ట్రంలో చిన్ననీటి వనరులకు ఉన్న కేటాయింపుల్లో ఆదా చేసుకుని 45 టీఎంసీల నీటిని తాము పాలమూరు- రంగారెడ్డికి వాడుకుంటామని తెలంగాణ చెబుతోంది. అందుకు అభ్యంతరం చెప్పొద్దని సీడబ్ల్యూసీ ప్రతిపాదించింది. ఇలా పాలమూరు- రంగారెడ్డి సాకారమైతే.. పోలవరం- నల్లమలసాగర్ అనుసంధానానికి తెలంగాణను ఒప్పించేలా కొన్ని అంశాలు వారు ప్రస్తావించారు.


పోలవరం

**123 టీఎంసీలతో లింకు ప్రాజెక్టు**

పోలవరం- నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టును వరద జలాలతో చేపడతామని ఏపీ ప్రతిపాదించింది. పోలవరం నుంచి 200 టీఎంసీల వరద జలాలను మళ్లించాలనేది ప్రభుత్వ ప్రణాళిక. ప్రాథమిక అనుమతుల కోసం సీడబ్ల్యూసీకి ఇప్పటికే నివేదించింది. అయితే, వరద జలాలపై ప్రాజెక్టులకు అనుమతులు ఎలా ఇస్తామని సీడబ్ల్యూసీ ప్రశ్నిస్తోంది. తాజాగా ఆ సంఘం ఛైర్మన్ ఇచ్చిన ప్రజంటేషన్‌లో 123 టీఎంసీల నికర జలాలు ఎలా సమకూర్చవచ్చో పేర్కొన్నారు. కేంద్ర జాతీయ జల అభివృద్ధి సంస్థ ఇచ్చంపల్లి నుంచి కావేరి వరకు నదుల అనుసంధానాన్ని ప్రతిపాదిస్తోంది. దీనిపై భాగస్వామ్య రాష్ట్రాలను ఒప్పించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ఈ అనుసంధాన ప్రాజెక్టుకు నీటిని తెలంగాణలోని సమ్మక్క సారక్క బ్యారేజీ నుంచి తీసుకెళ్లేలా సీడబ్ల్యూసీ ప్రతిపాదిస్తోంది. అలా చేస్తే సమ్మక్క సారక్క బ్యారేజీ కింద తెలంగాణ ప్రస్తావిస్తున్న 47 టీఎంసీలు పోలవరం- నల్లమలసాగర్ అనుసంధానానికి ఇచ్చేలా ఒప్పించవచ్చు. పాలమూరు- రంగారెడ్డికి గోదావరి నుంచి ఇస్తున్న 45 టీఎంసీలకు ప్రతిగా ఈ నీళ్ల ఇచ్చేందుకు తెలంగాణకు ఆస్కారం ఉండొచ్చన్నది ఈ ప్రతిపాదన సారాంశం.

గోదావరి-కావేరి అనుసంధానిస్తే 148 టీఎంసీలను తరలించవచ్చని జాతీయ జల అభివృద్ధి సంస్థ యోచిస్తోంది. ఇందుకు భాగస్వామ్య రాష్ట్రాల అనుమతి కోరుతోంది. ఛత్తీస్‌గఢ్ వాటా నీళ్ల నుంచి ఈ ప్రాజెక్టు చేపట్టాలని కేంద్రం భావిస్తోంది. అందులో భాగంగా ఏపీకి 45 టీంఎసీల నికర జలాలు వస్తాయి. వాటిని కూడా తాజాగా లెక్కలోకి తీసుకున్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఆమోదం తెలిపే క్రమంలో నీటి లభ్యతను లెక్కించినప్పుడు 16 టీఎంసీలు పరిగణనలోకి తీసుకోలేదని సీడబ్ల్యూసీ పేర్కొంటోంది. ఇప్పుడు ఆ 16 టీఎంసీల జలాలు కూడా నల్లమలసాగర్‌కు వినియోగించుకోవచ్చని సూచిస్తోంది.

కర్ణాటక రాష్ట్రం బేడితి- వరద లింకు ప్రాజెక్టు చేపడుతోంది. దాని ద్వారా తుంగభద్రలోకి 16 టీఎంసీల నీళ్లు వస్తాయి. ఇవన్నీ కలిపితే 123 టీఎంసీల నికర జలాలు ఏపీకి అందుబాటులో ఉంటాయన్నది కేంద్ర జలసంఘం లెక్క! అటు తెలంగాణ అవసరాలను ఏపీ తీర్చి, ఏపీ అవసరాలకు తెలంగాణ సమ్మతిస్తే ఈ ప్రతిపాదన కార్యరూపం దాలుస్తుందనేది జలసంఘం ప్రజంటేషన్‌లో కీలకాంశం.

ఆ లెక్కలు సహేతుకం కావు

రాష్ట్ర అధికారులు ఈ లెక్కలతో ప్రాథమికంగా విభేదించినట్లు సమాచారం. సీడబ్ల్యూసీ చెబుతున్న లెక్కల్లో, పేర్కొంటున్న కేటాయింపుల్లో కొన్ని గోదావరి అవార్డులో కూడా లేవని, ఈ నీళ్లన్నీ కాగితాలపై కనిపిస్తున్నాయే తప్ప వాస్తవంగా లేవని ఏపీ అధికారులు ప్రాథమికంగా అభిప్రాయపడ్డారు. దీనిపై అంతర్గతంగా చర్చలు సాగుతున్నాయి.

# పాపులేషన్ పాలసీపై విమర్శలు గళాన్ని వినిపిస్తున్న మహిళా సంఘాలు

స్వర్ణసాగరం విజయవాడ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన సరికొత్త జనాభా విధానం ఇప్పుడు దేశవ్యాప్తంగా సామాజిక, రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారింది. భవిష్యత్తులో యువ శ్రామిక శక్తి కొరత ఏర్పడకూడదనే ఉద్దేశంతో ఎక్కువ మంది పిల్లలను కనే దంపతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు 3వ బిడ్డకు రూ.30 వేలు, 4వ బిడ్డకు రూ.40 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అయితే, ఈ ప్రతిపాదనపై మహిళా సంఘాలు మరియు ఫెమినిస్టులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మహిళల శరీరం, ఆరోగ్యం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశాలని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మహిళలను పిల్లలను కనే యంత్రాలు గా పరిగణించడం ఏమాత్రం సమంజసం కాదని వారు మండిపడుతున్నారు. ప్రముఖ పీడియాట్రీషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ ఈ పాలసీపై సోషల్ మీడియా వేదికగా సంధించిన ప్రశ్నలు వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే రూ.30,000 లేదా రూ.40,000 సాయం కొద్ది రోజుల్లోనే ఖర్చయిపోతుందని, ఆ తర్వాత ఆ బిడ్డల పోషణ, చదువు, ఆరోగ్య బాధ్యతలను పేద కుటుంబాలు ఎలా మోస్తాయని ఆమె ప్రశ్నించారు. కేవలం తాత్కాలిక నగదు ఆశ చూపి పేదలను ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చేలా ప్రోత్సహించడం వారిని మరిన్ని ఆర్థిక కష్టాల్లోకి నెట్టడమేనని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మౌలిక వసతులు లేని చోట జనాభా పెంపు శిశు, మాతృ మరణాల రేటును పెంచే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మాజీ హెల్త్ సెక్రటరీ పీవీ రమేష్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం జనాభా సంఖ్యను పెంచడం కంటే, ప్రస్తుతం ఉన్న జనాభాకు నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం, పౌష్టికాహారం అందించడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు ఇంకా పూర్తిస్థాయిలో బలోపేతం కాకముందే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల తల్లుల ఆరోగ్య భద్రత ప్రమాదంలో పడుతుందని ఆయన విశ్లేషించారు. నాణ్యమైన మానవ వనరుల అభివృద్ధికి సంఖ్య కంటే సౌకర్యాలు ముఖ్యమని ఆయన కోణంలో స్పష్టం చేశారు. ఈ అంశంపై పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ, సినీ నటి పూనమ్ కౌర్ వంటి వారు కూడా తమ గళాన్ని వినిపించారు. సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబు వ్యాఖ్యలను కొందరు దూరదృష్టి గా అభివర్ణిస్తుంటే, మరికొందరు దీనిని మహిళా వ్యతిరేక ధోరణి గా ట్రోల్ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలు ఈ పాలసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సీఎం ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, అది మహిళల ప్రాథమిక హక్కులను ప్రభావితం చేసేలా ఉండకూడదని వారు వాదిస్తున్నారు. సీపీఎం నాయకురాలు బృందా కారత్ కూడా చంద్రబాబు పాపులేషన్ పాలసీని ఖండించారు చంద్రబాబు ఎన్డీయేలో చేరిన తర్వాత సొంత తెలివితేటలను, ఆలోచనా విధానాన్ని తాకట్టు పెట్టేంత దూరంగా వెళ్ళిపోయారా అని ప్రశ్నించారు. రూ. 30,000 ఆశ చూపి, ఒక మహిళకు తన సొంత గర్భంపై ఉన్న ప్రాథమిక హక్కును మీరు లాక్కోవాలని చూస్తున్నారు... ఇప్పుడు ఏం జరుగుతుందంటే, ఈ రూ. 30,000 - రూ. 40,000 ఆశకు లోబడి, ఆ మహిళ కుటుంబ సభ్యులు ఆమెపై విపరీతమైన ఒత్తిడి తెస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు, చంద్రబాబు మద్దతుదారులు మాత్రం ఈ పాలసీని సమర్థిస్తున్నారు. ప్రభుత్వం ఎవరినీ బలవంతం చేయడం లేదని, కేవలం స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి ప్రోత్సాహం అందిస్తోందని వారు చెప్తున్నారు. రాబోయే దశాబ్దాల్లో ఏపీలో వృద్ధాప్య సంక్షోభం తలెత్తకుండా ఉండాలంటే ఇప్పుడే మేల్కొనాలని, జనాభా సంతులనం కోసమే ఈ పాలసీని వర్కవుట్ చేస్తున్నారని వారు స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా, ముఖ్యమంత్రి లేవనెత్తిన ఈ అంశం ఇప్పుడు జాతీయ మీడియాలో సైతం హాట్ టాపిక్‌గా మారి, భిన్నమైన వాదనలకు దారితీస్తోంది. చదరపు కిలోమీటర్ కు 480 మంది పైనే మన దేశంలో జనాభా ఇప్పటికే సుమారు 140 కోట్ల పైగా ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు పెంపు అవసరమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జనాభా కారణంగా ఇప్పటికే మన దేశంలో వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. ప్రజలకు పాలకులు మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నారు. మంచి విద్య అందడం లేదు. ఆసుపత్రుల కొరత ఉంది. ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు లభించడం లేదు. సంపద కూడా కొందరి వద్దనే ఉంటుంది. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి.చదరపు కిలోమీటరుకు కనిపించే జనసాంద్రత భారతదేశంలో ఎక్కువగా ఉంటుంది, ఇది మౌలిక సదుపాయాలపై భారం పెంచుతుంది. రవాణా, ఆరోగ్య, విద్య, నీటి సరఫరా వంటి సేవల అందుబాటును ప్రస్తుత జనాభా కూడా కష్టపడి తీర్చుకుంటోంది. అంతకంటే ఎక్కువ జనాభా పెరగడం పరిస్థితిని మరింత యంత్రంగా మార్చే అవకాశం ఉంది. అమెరికాలో చదరపు కిలోమీటర్ కు 33 మంది, చైనాలో చదరపు కిలోమీటర్ కు 150 మంది ఉన్నారు. మనదేశంలో కూడా ఫెర్టిలిటీ రేటు తగ్గుతుంది. కానీ జనాభా పెంపు ఇప్పట్లో అవసరం లేదు.ఆంధ్రప్రదేశ్‌లో జనాభా 5 కోట్లకు పైగా ఉంది. ఇది దక్షిణ కొరియాతో సమానం. దక్షిణ కొరియా ప్రపంచంలో చాలా మెరుగైన అభివృద్ధి చెందిన దేశం. ఆంధ్రప్రదేశ్లో చాలావరకు మౌలిక సదుపాయాల లేవు. తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాల్లో చివరి స్థానంలో ఉంది. జిడిపి పెంపు ప్రజలకు మెరుగైన జీవనం కల్పించడంపై దృష్టి పెట్టాల్సిన తరుణంలో జనాభా పెంపుకు పిలుపునివ్వడం విమర్శలకు తావిస్తోంది.చంద్రబాబు జనాభా పెంపు గురించి ప్రజలను ప్రోత్సహించడం కన్నా ముందు సదుపాయాలపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అజీర్ణంతో బాధపడుతున్న వ్యక్తి ఆకలితో ఉన్నవాడిని ఒకప్పుడు తినమని సూచించినట్లుగా ఉందన్న విమర్శలు వస్తున్నాయి. అధిక జనాభా సూచన రాజకీయంగా రాకుండా వాస్తవ సమస్యల్ని మరింత పెంచే ప్రమాదం ఉంది.

## తీరం మనదే.. వేటా మనదే!

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాలవాళ్లు రావడానికి లేదు. డ్రోన్ల ద్వారానూ గస్తీ నిర్వహించి హెచ్చరికలు జారీచేస్తున్నాం. సముద్రజలాల్లోకి ప్రవేశించగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుంది. వెంటనే అప్రమత్తమవుతాం. పొరుగు రాష్ట్రాల బోట్లకు తెలుగు, తమిళం ఇతర భాషల్లో డ్రోన్ల ద్వారా హెచ్చరికలు జారీచేస్తాం. ఎవరినీ రానివ్వం' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం తుమ్మలపెంటలో 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవాలని 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్లను బ్యాంకుఖాతాల్లో వేశాం. 2026-27లో రూ.50 కోట్ల విలువైన డీజిల్ రాయితీని బోట్లకు అందించాం. రూ.3,256 కోట్లతో తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. మత్స్యకారుల రక్షణ కోసం సముద్రంలో 4,550 ట్రాన్స్‌పాండర్లను ఏర్పాటుచేసి కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటుచేశాం. మత్స్యకారులకు 60% రాయితీతో 200 మెకనైజ్డ్ బోట్లు ఇస్తాం. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణం మంజూరుచేయిస్తాం. రూ.288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నాం' అని చంద్రబాబు తెలిపారు.

**ఫేక్ ప్రచారాలు నమ్మొద్దు**

'రాష్ట్రానికి ఆదాయం వచ్చే రంగాలపై దృష్టిపెట్టి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. గత పాలకులు చేసిన విధ్వంసాన్ని సరిచేయడానికి 23 నెలలు పట్టింది. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతంలో ఏర్పాటవుతున్న సాగర్ డిఫెన్స్ సంస్థపై కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారు. దీని ద్వారా స్థానికులకే ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో ఓ గొడ్డలి పార్టీ లేనిపోని కుట్రలతో ఫేక్ ప్రచారాలు చేస్తోంది. బాబాయ్ నుంచి దస్తగిరి వరకూ హత్యలు చేస్తూ రాష్ట్రాన్ని వెనక్కి లాగుతోంది' అని సీఎం ధ్వజమెత్తారు.

**తెదేపా డీఎన్ఏలోనే బీసీలు**

'తెదేపాకు బీసీలతో దశాబ్దాల అనుబంధం ఉంది. పార్టీ డీఎన్ఏలోనే బీసీలు ఉన్నారు. వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుంది. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం. నాయీబ్రాహ్మణులకు రూ.25వేల వేతనం, వడ్డెర్లకు, గీతకార్మికులకు గనులు, మద్యం దుకాణాలను కేటాయిస్తున్నాం. 45 ఏళ్లుగా బీసీలు తెదేపాను ఆదరించారు. వారి రుణం తీర్చుకుంటాం' అన్నారు. సముద్రపు నాచుసాగుపై మత్స్యకార మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెడికల్ షాపుల బంద్

స్వర్ణసాగరం అమరావతి

ఆన్‌లైన్ ఫార్మసీలు (ఈ-- ఫార్మసీలు) నిబంధనలకు విరుద్ధంగా మందుల్ని విక్రయించడాన్ని నిరసిస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) పిలుపు మేరకు బుధవారం దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ పాటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో దాదాపు 45 వేల మెడికల్ షాపుల్లో మందుల విక్రయాలు నిలిచిపోనున్నాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు రిటైల్ మందుల దుకాణాలు పూర్తిగా మూతపడనున్నాయి. అయితే రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రులకు అనుబంధంగా ఉండే మందుల షాపులు తెరిచే ఉంచుతారు.

**అసలు వివాదం ఏంటి?**

కోవిడ్ సమయంలో మందుల కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా డోర్ డెలివరీకి అనుమతి ఇచ్చింది. కోవిడ్ వ్యాప్తి ముగిసినా కార్పొరేట్ సంస్థలు ఆ తాత్కాలిక వెసులుబాటును అడ్డం పెట్టుకుని ఆన్‌లైన్‌లో నేటికీ విక్రయిస్తున్నాయి. నిత్యావసర సరుకుల మాదిరిగా మందులను విక్రయించడం ప్రజారోగ్యానికి పెద్ద ముప్పు అని మెడికల్ షాపు యజమానులు అంటున్నారు. ఈ--ఫార్మసీలు రిటైల్ మెడికల్ మార్కెట్‌ను ఆక్రమించుకునేందుకు భారీ డిస్కౌంట్లు ఇస్తూ అనారోగ్యకరమైన పోటీని సృష్టిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. డిస్కౌంట్ల కోసమే ఆన్‌లైన్‌లో మందులు ఆర్డర్ చేస్తూ ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఔషధ నియంత్రణ చట్టం ప్రకారం షెడ్యూల్ హెచ్‌లోని యాంటీబయాటిక్స్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ తగ్గించే మందులు, పెయిన్ కిల్లర్స్‌తోపాటు షెడ్యూల్ ఎక్స్‌లోని నిద్ర మాత్రలు, ఇతర మత్తు మందులకు వైద్యుల ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి. ఈ మందులు ఆన్‌లైన్ విక్రయాలతో దుర్వినియోగానికి గురి అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ఫార్మసీలు నిబంధనలకు విరుద్ధంగా మందుల్ని విక్రయించడాన్ని నిరసిస్తూ ఏఐఓసీడీ బంద్‌కు పిలుపునిచ్చింది.

## 19 వర్సిటీల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినా.. దివ్యాంగులకు రిజర్వేషన్లు లేవు



స్వర్ణసాగరం అమరావతి

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆల్ యూనిముర్సిటీ దివ్యాంగ్ వింగ్స్ ప్రతినిధులు కలిశారు. మంగవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో దివ్యాంగ్ వింగ్స్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు వైఎస్ జగన్‌ను కలిసి తమ సముస్యలను వివరించారు. రాష్ట్రంలోని 19 యూనివర్సిటీలలో 1,523 అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ, దివ్యాంగులకు ఎలాంటి రిజర్వేషన్లు కల్పించలేదని వైఎస్ జగన్‌కు తెలిపారు. ఉన్నత విద్యనభ్యసించి పీహెచ్‌డీలు పూర్తి చేసిన తమలాంటి దివ్యాంగులు రిజర్వేషన్లు లేకపోముడం వల్ల ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల హక్కులు, సాధికారత కోసం భారత ప్రభుత్వం అమలు చేస్తున్న వికలాంగుల హక్కుల చట్టం--2016ను చంద్రబాబు ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరువల్ల దివ్యాంగులు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని చెప్పారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో కూడా తమకు తగిన అవకాశాలు ఇవ్వడం లేదని వాపోయారు. దివ్యాయిగుల సమస్యలను వైఎస్ జగన్ సావధానంగా విన్నారు. వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలను గుర్తుచేసి భవిష్యత్తులోనూ దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

మా కలం - సామాన్యుడి బలం
RNI No : APTEL/2020/15905
జాతీయ తెలుగు దినపత్రిక

# ఎపి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సర్పంచుల సంఘం కార్యదర్శి కుప్పాల మురళి జన్మదిన వేడుకలు





**బంగారుపాలెం.స్వర్ణసాగరం. మే 19**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలం మంగళపల్లి మాజీ సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి కుప్పాల మురళి జన్మదిన వేడుకలు కేజీ సత్రం నందు తన స్నేహితులు, సహచరులతో, టిడిపి పార్టీ నాయకులతో కలసి కేజీ సత్రం దగ్గర భారీ కేక్ కట్ చేసారు కుప్పాల మురళి కి తన స్నేహితులు శాలువాలు కప్పి పూలమాలలు వేసి తాను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని జన్మదిన వేడుకలు ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో చీకూరుపల్లి, కేజీ సత్రం, వెంకటాపురం, మంగళపల్లి, గుండ్లకట్టమంచి, బంగారుపాళ్యం నుండి కొంతమంది స్నేహితులు వచ్చి ఘనంగా సత్కరించడం జరిగింది.

# "కాణిపాకం పోదామా... శ్రీశైలం పోదామా?"

## ప్రమాణానికి సిద్ధం"

## సోమిరెడ్డి, టిడిపి నాయకుల సిద్ధమా ప్రమాణానికి..

## "కాకాణిని విమర్శించే అర్హత మల్లికార్జున యాదవ్‌కు లేదు"

## "టీడీపీ నేతలకు పాముల శ్రీనివాసులు సవాల్"



**ముత్తుకూరు.. స్వర్ణ సాగరం**

ఇరిగేషన్ బిల్లుల చెల్లింపుల వ్యవహారంలో మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా వాస్తవాల ఆధారంగానే ఉన్నాయని, ఆ విషయంపై దేవుడి సాక్షిగా ప్రమాణం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పాముల శ్రీనివాసులు స్పష్టం చేశారు. అదే విధంగా ఆరోపణలు అవాస్తవమని భావిస్తే టీడీపీ నాయకులు కూడా కాణిపాకం వినాయక స్వామి దేవస్థానం లేదా శ్రీశైలం మల్లికార్జున స్వామి సన్నిధికి వచ్చి ప్రమాణం చేయాలని బహిరంగ సవాల్ విసిరారు. మండల కేంద్రంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరిగేషన్ బిల్లుల చెల్లింపుల్లో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించిన అంశాలను ఖండించడం కంటే, వాటిపై అధికార పార్టీ నేతలు స్పష్టత ఇచ్చి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. అవినీతి జరగలేదని చెబుతున్న వారు అయితే, స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి ఇప్పటివరకు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.రాజకీయాల్లో హోదా, అనుభవం, ప్రజాదరణను దృష్టిలో ఉంచుకుని మాట్లాడాలని సూచించిన ఆయన, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుడిపై విమర్శలు చేసే స్థాయి టీడీపీ నాయకుడు మల్లికార్జున యాదవ్‌కు లేదన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడే నాయకులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని విమర్శించడం సరికాదని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో అనుచిత వ్యాఖ్యలు కొనసాగిస్తే, టీడీపీ నాయకులు చేసిన అన్ని వ్యవహారాలను ఆధారాలతో సహా మీడియా ముందుంచుతామని పాముల శ్రీనివాసులు హెచ్చరించారు.ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యుడు పెదకాల శివ, మోహన్ రెడ్డి, చెంగయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం.. మూడు రోజుల శిక్షణ ముగింపు

## స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ)పై అధికారులకు అవగాహన

## మరుగుదొడ్లు, వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ

## 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై దిశానిర్దేశం

## మహిళా సంఘాల భాగస్వామ్యంతో పరిశుభ్రత కార్యక్రమాలకు ప్రాధాన్యం






**ముత్తుకూరు.. స్వర్ణ సాగరం**

గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన ఈ శిక్షణలో పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.మూడో రోజు త్రాగునీటి నిర్వహణ, నీటి నాణ్యత పరిరక్షణ అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగమణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే కాకుండా వాటి వినియోగంపై కూడా నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు.చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పురోగతి, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు 15 ఫైనాన్స్ ద్వారా విడుదల చేసిన నిధులను సకాలంలో వినియోగించి పనులు పూర్తి చేయాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు.మహిళా సంఘాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థుల భాగస్వామ్యంతో పరిశుభ్రత కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొన్న అధికారులకు గ్రామాల్లో అమలు చేయాల్సిన కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ శాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# .సాంకేతిక విద్యతో ఉపాధి పొందవచ్చు.

## అనుముల జయప్రకాష్,జిల్లా పిఎంపి గౌరవాధ్యక్షులు.



**నెల్లూరు స్వర్ణ సాగరం మే 19**

సాంకేతిక విద్యతో ఉపాధి పొందే అవకాశాలు ఎన్నో ఉన్నాయని పి.ఎం.పి జిల్లా గౌరవ అధ్యక్షులు అనుముల జయప్రకాష్ అన్నారు. డైకస్ రోడ్ సెంటర్ లోని రూడ్స్ కార్యాలయం నందు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఎన్ని డిగ్రీలు ఉన్న, కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరం అన్నారు. విద్యాలయాలలో చేసే డిగ్రీలతోపాటు అతి తక్కువ సమయంలో కూడా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పొందవచ్చు అన్నారు. ప్రాథమిక పరిజ్ఞానం కంప్యూటర్ రంగంలో ప్రతి ఉద్యోగికి, ఉద్యోగులకే కాక యువతీ యువకులకు అత్యవసరం అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాబోవు తరానికి కంప్యూటర్, ఎ.ఐ పరిజ్ఞానం తప్పనిసరి అని ఆయన అన్నారు. పదవ తరగతి పూర్తి కాగానే స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్, యం.ఎస్ ఆఫీసు పరిజ్ఞానం పొందాలన్నారు. జిల్లా పీఎంపీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ ఆర్థిక సహకారంతో ఎన్.సి.సి కాలనీలోని కీర్తి టెక్నాలజీ నందు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, ఎంఎస్ ఆఫీస్ శిక్షణలో ప్రాథమిక సర్టిఫికెట్ పొందిన కోవూరుకి చెందిన నీలోఫర్ అనే విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, కీర్తి టెక్నాలజీ చైర్మన్ చంద్రిక, జిల్లా పీ.హెచ్.పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

## - శోభ రాణి సిడిపిఓ

**కార్వేటినగరం: శ్రీరంగరాజపురం స్వర్ణ సాగరం :మే 19:**

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపి ఓ శోభారాణి తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుందని ఆమె అన్నారు. ఈ క్రమంలో వెదురు కుప్పం, ఎస్సార్ పురం మండలం నుంచి ఖాళీలు పడ్డాయన్నారు. వివరాలకు సంబంధిత సిడిపిఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ను కలిసిన మైనార్టీ నాయకులు





**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం. మే 19**

బంగారుపాళ్యం మండలం లోని ముస్లిం మైనారిటీ నాయకులు చిత్తూరు జిల్లా వైఎస్సార్ పార్టీ ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షులు ఫిరోజ్ అహమద్ (అన్ను )ఆధ్వర్యంలో సోమవారం పలమనేరు లో పూతలపట్టు సమన్వయ కర్త డాక్టర్ సునీల్ కుమార్ ను మర్యాద పూర్వాకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజిసిన బంగారుపాళ్యం మైనారిటీ నాయకులు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మైనారిటీ కార్యవర్గం లో జిల్లా సెక్రటరీ గా ఎస్ సల్మాన్ ని నియమించడం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు అన్ను, సీనియర్ మైనారిటీ నాయకులు చందులల్, అల్తాఫ్ భాయ్, వైస్సార్ ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షులు రియాజ్ వైస్ ప్రెసిడెంట్ అసిఫ్, సెక్రటరీ ఫరూక్, జాకీర్, రియాజ్ భాయ్,సునీల్ మండల యూత్ జనరల్ సెక్రటరీ రసూల్,జిల్లా మైనారిటీ సెక్రటరీ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు

# "ప్రపంచ మేధావి" కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి

## 41వ వర్ధంతి సందర్భంగా సిపిఎం నేతలు



**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే 19**

ప్రపంచ మేధావి కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం నేతలు పేర్కొన్నారు మండల కేంద్రంలోమంగళవారం సుందరయ్య 41వ వర్ధంతి వేడుకలుస్థానిక నేత బండి శౌరి ఆధ్వర్యంలో నిర్వహించారు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారుఈ సందర్భంగా సిపిఎం నేత మారు బోయిన రాజా మాట్లాడుతూకమ్యూనిస్టు భావజాలంతో పేద వర్గాల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తిగా కొనియాడారు.ఆయన స్ఫూర్తితో మండలంలో ప్రజా పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు.ఆయన బాటలో ముందుకు పోవడమే సిపిఎం ధ్యేయమన్నారుఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో సిపిఎం నేతలు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# సాయిబాబా దేవస్థానం నందు సద్గురు సాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 73వ వసంతోత్సవ కార్యక్రమం

## పాల్గొన్న మాజీ మంత్రి మహేంద్ర రెడ్డి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి



**కనిగిరి స్వర్ణ సాగరం మే 19**

కనిగిరి శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానం నందు 73 వ వసంతోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు మానుగుంట మహీధర్ రెడ్డి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసారు.అనంతరం శ్రీ సద్గురు సాయి సేవాసమితి అధ్యక్ష కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం,గోపాలుని హరిహరరావు ముచ్చర్ల ధర్మారావు ఆలయ గౌరవ అధ్యక్షులు బోయెళ్ళ తిరుపతి రెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి అధ్యక్ష కార్యదర్శులు కొప్పరపు సత్యాలు, బాలు ఓబుల్ రెడ్డి, విసి రామశాస్త్రి వాగిచర్ల వెంకటేశ్వర్లు, బాబాకు పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తెలుగు సాయి సచ్చరిత్ర రచయిత ప్రత్తి నారాయణ రావు జీవిత చరిత్రను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సద్గురు సాయి సేవా సమితి సాయిబాబా ఆలయ కమిటీ సంయుక్తంగా నిర్వహించారు.

## ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

### కమిషనర్ పర్వతనేని శ్రీధర్



కనిగిరి స్వర్ణ సాగరం మే 19

ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. మంగళవారం పురపాలక సంఘం కార్యాలయంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ శ్రీధర్ మాట్లాడుతూ వార్డు ప్లానింగ్ సెక్రెటరీ వారు అక్రమ కట్టడములను గుర్తించి, అనుమతులు లేని వారికి నోటీసులు జారీచేసి చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా వేసిన అనధికార లే అవుట్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వ వాగుపోరంబోకు, చెరువులు, కుంటలు తదితర భూముల ఆక్రమణలకు గురైన స్థలాలను గుర్తించి నివేదిక అందచేయాలన్నారు. ఆక్రమణలు గుర్తించిన వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్లానింగ్ సెక్రటరీలు కృష్ణ, నవీన్, చెన్న నారాయణ, రూఫియా, హరిత తదితరులు పాల్గొన్నారు

## శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానములో మహాప్రాకారం నిర్మాణము సి.జి.యఫ్ నిధుల నుండి రూ.2,00,00,000/- మంజూరు



కనిగిరి స్వర్ణ సాగరం మే 19

మిట్టపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానంలో మహాప్రాకార నిర్మాణమునకు స్థానిక శాసన సభ్యులు, ప్రకాశం జిల్లా టిడిపి అధ్యక్షులు శ్రీ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి సహకారంతో సి.జి.యఫ్ నిధుల నుండి రూ.2,00,00,000/- మంజూరు చేసియున్నారు. సదరు ఉత్తర్వులు స్థానిక శాసన సభ్యులు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబుకి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ దేవాదాయ శాఖ మాత్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ సదరు పనికి సంబంధించి టెండరు ప్రాసెస్ అన్నియు త్వరితగతిన పూర్తి చేసి పనులు మొదలుపెట్టాలి అని సూచించారు.

## దేశం రజక సంఘ నాయకుడు బెల్లంకొండ శీనయ్య మృతి బాధాకరం

: గాలి మురళి నాయుడు,

శీనయ్య భౌతికకాయానికి నివాళులర్పించిన టీడీపీ నాయకులు,

సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తామని కుటుంబానికి భరోసా,



స్వర్ణసాగరం -తొట్టంబేడు,

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం దిగువ కొనతనేరి పంచాయితీ గుర్రప్ప నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన దేశం రజక సంఘ నాయకుడు బెల్లంకొండ శీనయ్య అనారోగ్యంతో మృతి చెందడం విషాదకరమని మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు తెలిపారు.గత నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శీనయ్య తిరుపతిలోని సిమ్స్ ఆసుపత్రి మరియు నెల్లూరులోని ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో స్వగ్రామమైన గుర్రప్ప నాయుడు కండ్రిగకు తీసుకువచ్చారు. అక్కడ ఆయన తుదిశ్వాస విడిచారు.శీనయ్య భౌతికకాయానికి మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, కొనతనేరి ఆయకట్టు అధ్యక్షులు లెక్కల వెంకట ముని నాయుడు, మాజీ ఎంపీటీసీ భాస్కరయ్య, బూత్ ఇంచార్జ్ లెక్కల మురళి నాయుడు, లెక్కల సుధాకర్ నాయుడు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గాలి మురళి నాయుడు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డితో మాట్లాడి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చికిత్స ఖర్చులకు సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే తెలుగుదేశం పార్టీ తరపున శీనయ్య కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేయాలి - దద్దాల

కనిగిరి స్వర్ణ సాగరం మే 19



పార్టీ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలని వైయస్సార్సీపి కనిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సూచించారు.వంకదారి వెంకట రాజా ప్రకాశం జిల్లా పార్టీ బీసీ సెల్ కార్యదర్శి గా నియమితులైన సందర్భంగా సోమవారం కనిగిరి స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి నారాయణ యాదవ్ గారిని , మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి శాలువతో ఘనంగా సన్మానించారు.అనంతరం వంకదారి రాజా గారికి అభినందనలు తెలిపి శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కేతినేని నరసింహ, కోమటికుంట్ల భాష, బెల్లంకొండ రంగనాయకులు,శనగం ప్రసాద్, కొమ్మిరెడ్డి సుబ్బారావు,కొమ్మిరెడ్డి తిరుపతయ్య, రమణయ్య,అన్నపరెడ్డి శివ,ఆర్నూరి అవినాష్,ఎక్కులూరి యోగి తదితరులు పాల్గొన్నారు.

## స్వగృహంలో జన్మదిన వేడుకలు జరుపు కోవడం జన్మ సుకృతం







### 73వజన్మదిన వేడుకల సందర్భంగా ఎన్.డి.ఆర్ సంస్థ అధినేత నాయుడు ఆది కేశవుల రెడ్డి

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే 19

మండలంలోని మాచర్ల వారి పాలెం గ్రామానికి చెందిన ఎన్ డి ఆర్ సంస్థ అధినేత విద్యాదాత దైవ భక్తులు నాయుడు ఆది కేశవుల రెడ్డి73 వ జన్మదిన వేడుకలుతన స్వగృహంలో గ్రామస్తులు విద్యార్థులు కుటుంబీకుల మధ్య సంతోషంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా తోటపల్లి గూడూరు ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలోఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులనునగదు బహుమతులతో సత్కరించారు.అదేవిధంగా నాయుడు దశరథ రామిరెడ్డి జూనియర్ కళాశాలకుకంప్యూటర్లు బహుకరించారుఈ సందర్భంగా మాట్లాడుతూ తన స్వగ్రామంలోజన్మదిన వేడుకలు జరుపుకోవడం పూర్వజన్మ సుకృతం అన్నారు.తమ కుటుంబీకుల ఆచరణలో తాను ముందుకు పోతున్నట్లు వివరించారు.ప్రధానంగా తమ గ్రామం అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి తన తోడ్పాటు ఉంటుందన్నారుఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో వేలాదిమంది పాల్గొన్నారు.గ్రామస్తులకు వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాయుడు వెంకట నర్సారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్ తోటపల్లి గూడూరు హై స్కూల్ హెచ్ఎం షేక్ రియాజ్ అహ్మద్ స్పెషల్ టీచర్ బిరామచంద్రయ్య గ్రామస్తులు విద్యార్థులు కుటుంబీకులు పాల్గొన్నారు

## మహనీయుల మార్గమే కాదు. సమాజ సేవలోనూ దూసుకుపోతున్న బహుజన యూత్ ఫోర్స్





### మరోసారి మానవత్వాన్ని చాటుకున్న బహుజన యూత్ ఫోర్స్

### మట్టిలో మాణిక్యం దారా సంతోష్ కు అండగా బహుజన యూత్ ఫోర్స్

### ఎందరికో ఆదర్శంగా నిలుస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్న బహుజన యూత్ ఫోర్స్

కోట స్వర్ణసాగరం మే 19

ఇటీవల స్థాపించిన బహుజన యూత్ ఫోర్స్ సంస్థ గూడూరు నియోజకవర్గంలో యువతను చైతన్యపరుస్తూ యువతలో సామాజిక బాధ్యతను రగుల్చుతూ,సమ సమాజ స్థాపన కోసం పోరాటం చేసిన మహనీయుల ఆలోచనలను భుజస్కందాలపై వేసుకొని బహుజన ఉద్యమ రథాన్ని ముందుకు లాగడం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న బహుజన యూత్ ఫోర్స్ సంస్థ అటు మహనీయుల మార్గంలో రాజీ లేని పోరాటం చేయడమే కాకుండా ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడుతూ సమాజ సేవలో సైతం దూసుకుపోతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో నాయుడుపేట మండలం మడఫలం గ్రామానికి చెందిన దారా సంతోష్ నాయుడుపేటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు చదివి 10 వ తరగతి పరీక్ష ఫలితాలలో 544 మార్కులు సాధించి గురుకులం టాపర్ గా నిలిచాడు.అటు చదువులోనూ ఇటు క్రీడలలో కూడా అండర్ 14 జాతీయస్థాయి క్రీడల్లో సంతోష్ 2024-25 ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్పూర్ లో జరిగిన కుస్తీ పోటీ లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున జాతీయ స్థాయి క్రీడాకారునిగా సంతోష్ గుర్తింపు పొందారు.అయితే సంతోష్ కుటుంబం కటిక పేదరికంలో ఉంది.ఉండటానికి సరైన ఇల్లు కూడా లేదు.ఉన్నత చదువులు చదువుకోవడానికి స్తోమత లేదు.అయితే ఇటీవల తన తల్లి మరణం,తండ్రి అనారోగ్య పరిస్థితి తన పై చదువులకి ఆటంకం కలిగింది. తండ్రిని ఎలా చూసుకోవాలో ఎలా చదవాలో దిక్కుతోచని నిస్సహాయ స్థితిలో బహుజన యూత్ ఫోర్స్ ను కలిసి సహాయం కోరాడు.వెంటనే స్పందించిన బహుజన యూత్ ఫోర్స్ నాయకులు మంగళవారం సంతోష్ స్వగృహంలో శాలువాలతో సత్కరించి ఐదు వేల రూపాయల నగదు ఆర్థిక సహాయం,పండ్లు అందించి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు.అనంతరం స్కూల్ టాపర్ గా నిలిచిన దారా సంతోష్ ని అభినందించారు.ఈ సందర్భంగా బహుజన యూత్ ఫోర్స్ నాయకులు మాట్లాడుతూ దారా సంతోష్ చదువుకు పేదరికం అడ్డు కాకూడదని అతని చదువుకు బహుజన యూత్ ఫోర్స్ అండగా నిలుస్తుంది అని తెలిపారు. భవిష్యత్తులో దాతల సహాయంతో సంతోష్ చదువులకు దాతల సహాయంతో సంతోష్ వెన్నంటే ఉంటూ డాక్టర్ అవ్వాలని అతని కలని నెరవేర్చే దిశగా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. బహుజన యూత్ ఫోర్స్ కన్వీనర్ శ్రీరామ్ శివప్రసాద్ (శంకర్) మాట్లాడుతూ దారా సంతోష్ కుటుంబానికి తాను ఒక పెద్ద కొడుకుల ఉండి డాక్టర్ చదవాలని సంతోష్ కోరికను తీర్చేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. అనంతరం అన్ బిన్ సువడుగల్ సంస్థ డైరెక్టర్ భూపతి మోహన్ సాయి మాట్లాడుతూ దారా సంతోష్ ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల చదువు కోసం అయ్యే పుస్తకాలను తన సంస్థ ద్వారా అందిస్తానని ప్రకటించారు.ఎవరైనా దాతలు నాయకులు స్పందించి చదువు పట్ల ఇంతటి మమకారం చూపుతున్న దారా సంతోష్ ఉన్నత చదువులకు సహాయం చేయాలని ఈ సందర్భంగా బహుజన యూత్ ఫోర్స్ నాయకులు తెలిపారు.ఆపదలో ఉన్న వారిని వెంటనే ఆదుకుంటూ పేద ప్రజలకు ఎవరికి ఏ సమస్య వచ్చిన మేమున్నామంటూ భరోసా కల్పిస్తూ వారికి ధైర్యాన్నిస్తున్న బహుజన యూత్ ఫోర్స్ సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు. ఈకార్యక్రమంలో బహుజన యూత్ ఫోర్స్ కన్వీనర్ శ్రీరాం శివ ప్రసాద్,గౌరవ సలహాదారులు ఐవీ రమణయ్య, కర్లపూడి.వెంకట రమణయ్య, నాయకులు భూపతి మోహన్ సాయి,మీడియా కో ఆర్డినేటర్ పాకం చెన్నకేశవలు,న్యాయవాది దాసరి అశోక్ కాంబ్లే,బి.వై.ఎఫ్ నాయకులు దేవా,టీచర్ దారా బాబు,పీఈటీ టీచర్ కాటయ్య, పామంజి నాగేంద్ర,శ్రీరాం రవి, తూపిలి నిరంజన్,సుజిత్,బందిల గౌతమ్,తూపిలి వినోద్,ప్రశాంత్, రాజశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ద్రోహి మాజీ సీఎం..జగన్మోహన్ రెడ్డి

### -ఏఎంసి డైరెక్టర్ జయంతి గుండయ్య



శ్రీరంగరాజపురం: స్వర్ణ సాగరం : మే 19:

దళితులకు ఆర్థిక సంక్షోభంలో కూడా ఆర్థిక భరోసా కల్పించి.. ఉత్తమమైన పాలనను అందించిన ఘనత సీఎం నారా చంద్రబాబునాయుడుదని, దళితులు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి సీఎం పీఠం ఇస్తే, అతనేమో గొడ్డలి పెట్టుద్వారా దళితులను నరకడం ప్రారంభించారని, అందుకే గత ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఘోర ఓటమిని చదివి చూశారని ఎఎంపి డైరెక్టర్ జయంతి గుండయ్య ధ్వజమెత్తారు. మంగళవారం మండలం లోని కటికపల్లి పంచాయతీ కార్యాలయంలో వైసిపి మాజీ ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీధి సు బ్రహ్మణ్యం చిత్రపటానికి నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో దళితులపై దాడులు, దౌర్జన్యాలతో పాటు హత్య రాజకీయాన్ని ప్రోత్సహించడం జరిగిందన్నారు. వీధి సుబ్రహ్మణ్యం డ్రైవర్ గా పని చేస్తున్నప్పుడు అతని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం గా పనిచేసిన నారాయణస్వామి తన (గుండయ్య)పై దళితుడిని చూడకుండా సుమారు 11 కేసులు పెట్టి ఇంటికి దూరంగా ఇబ్బందులు పాలయ్యానన్నారు. ఇలాంటి దుర్ఘటనలను ప్రతి తెలుగుదేశం కార్యకర్త అనుభవించి నేడు అధికారులకు వచ్చారని, వీరికి ఎమ్మెల్యే అండగా ఉంటూ... ప్రతి ఒక్క కార్యకర్త ఆవేదనను, సమస్యను నివృతి చేయుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు జయశంకర్ నాయుడు, నాయకులు బాబు నాయుడు, కే యం రవి, శేఖర్, బాబు నాయుడు, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీహెచ్ సి ల ద్వారా మెరుగైన వైద్య సేవలు

### సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ నేత బొబ్బేపల్లి



వెంకటాచలం స్వర్ణ సాగరం మే 19

పి హెచ్ సి ల ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ నేత బొబ్బేపల్లి సురేష్ నాయుడు పేర్కొన్నారు నియోజకవర్గంలోని ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత వైద్య అధికారుల ద్వారా జరుగుతున్న ఆరోగ్య సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమిపాలనలో సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నిత్యం స్థానిక సమస్యలు తెలుసుకుంటూ నియోజకవర్గంలో ఆరోగ్య కేంద్రాల కు కావలసిన వసతులు సమకూరుస్తూ కృషి చేస్తున్నారన్నారు ప్రధానంగా గిరిజనులకు అవసరమైన ఆరోగ్య సేవలు అందించడం జరుగుతుందన్నారు గిరిజనుల విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు ఈ కార్యక్రమంలో జనసేన నేతలు రహీం బోలా అశోక్ తగ్గోలు సుమన్ సందూరి శ్రీహరి చిన్న దినేష్ తదితరులు పాల్గొన్నారు

# అల్లాల విజయబాబుకు..కాపు సంఘం నేతలు ఘన సత్కారం





శ్రీరంగరాజపురం : స్వర్ణ సాగరం మే 19 :

ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎన్నికైన కొత్తపల్లె మాజీ సర్పంచ్ పుత్తూరు మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ వైఎస్ఆర్సిపి చిత్తూరు పార్లమెంటు మాజీ కార్యదర్శి అల్లాల విజయబాబుకు జాతీయ కాపు సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోపి రాయల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన కాపు సంఘ నాయకులు ఘనంగా శాలువాలు పూలహారాలతో సత్కరించారు. అనంతరం రుక్మిణి సమేత శ్రీ కృష్ణ చిత్రపటాని అందజేసి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విజయబాబు కాపు సంఘానికి చేసిన సేవలను గుర్తు చేశారు. విజయబాబును మంచి పదవిలో చూడాలని ఉంది అని గోపి రాయల్ అన్నారు. అనంతరం విజయబాబు మాట్లాడుతూ తాను కాపు సంఘానికి అందుబాటులో ఉంటానని శక్తి వంచన లేకుండా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ ఆత్మీయ సమావేశ కార్యక్రమంలో ప్రసాద్ రాయల్ మణి రాయల్, కదిరి రాయల్ , అయ్యప్ప రాయల్ ,నాగరాజు, వెంకటేష్, సుబ్రహ్మణ్యం , శీను ,రవి , గోపి ,జగదీష్, రాయల్,దేవరాజు రాయల్, లోకి , బాబు రాయల్ తదితర కాపు నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయి కనెక్షన్

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

## దామరమడుగు ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో తాగునీటి సరఫరా ప్రారంభం

కోవూరు, స్వర్ణ సాగరం, మే 19 :

ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని దామరమడుగు ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో మంగళవారం ఆమె తాగునీటి సరఫరాను అధికారికంగా ప్రారంభించారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఐదారు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నెలకొని ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కాలనీలో మొత్తం 315 ఫ్లాట్లు ఉండగా, గత ప్రభుత్వంలో 200 మందికి కేటాయించారని, ఇంకా 100 ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఖాళీగా ఉన్న ఫ్లాట్ల వివరాలను త్వరితగతిన అందించాలని హౌసింగ్ ఏఈని ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అర్హులైన పేదలకు ఈ ఖాళీ పట్టాలను పంపిణీ చేస్తామన్నారు.

**రూ. 11.25 లక్షలతో తాగునీటి వసతి**

కాలనీలో మంచి నీటి వసతి కోసం రూ. 11.25 లక్షలు ఖర్చు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న 15 రోజుల్లో మరో రూ. 6 లక్షలు వెచ్చించి మిగిలిన వారికి కూడా కుళాయి కనెక్షన్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీలోని కుట్టుశిక్షణా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.

**ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు**

దామరమడుగు హైస్కూల్‌లో పదో తరగతిలో ఈ సంవత్సరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సూరా పెద వెంకటయ్య జ్ఞాపకార్థం వారి మనమడు సూరా జగదీశ్శ్రీతు.. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతులు, పురస్కారాలను అందజేశారు. జక్కా వెంకయ్య, పార్వతమ్మ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు సుంకర ఆదినారాయణ, కార్యదర్శి చొప్పా రవీంద్రబాబులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి నిర్వహించారు.



?ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాలెం చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, తెదేపా మండల అధ్యక్షులు బెజవాడ జగదీష్, చేనేత సొసైటీ రాష్ట్ర డైరెక్టర్ కేపీ శేషయ్య, గ్రామ పెద్దలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోడూరు గ్రామంలోబడి పిలుస్తోంది





తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం మే 19

మండలంలోని మోడల్ ప్రైమరీ స్కూల్, కోడూరు గ్రామం లో మంగళవారం జుఅతీశీశ్రీశ్రీఎవత్ ‌సతీఱజవ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 1 ఎస్ వేణుగోపాల రెడ్డి , మండల విద్యాశాఖధికారి 2జయరాం నాయుడు , పాఠశాల ప్రధానోపాద్యురాలు శభారతీ దేవి , పాఠశాల సిబ్బంది ు సునీత, ఎ్త్ర. దేవ ప్రసాద్, జ. మాధవలక్ష్మి సిఆర్ఎంటి మురళి అంగన్వాడి సూపర్వైజర్ మరియు సిబ్బంది, పాఠశాల పూర్వ విద్యార్థి ు. శ్రీనివాసులు, ఎస్ ఎమ్ సి చైర్మన్ ‌ా. రేణుక, విద్యార్థుల తల్లి తండ్రులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఉపాధ్యాయురాలు లావణ్య ఎమ్ డి ఎమ్ నిర్వాహకురాలు అమృత, పాఠశాల శానిటరీ వర్కర్ నాగభూషణమ్మ, కోనేటి తోపు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ూ రామ్మోహన్ , వెంకటేశ్వర్ల రెడ్డి పాల్గొని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల గృహాలను సందర్శించి విద్యార్థులను మన ప్రభుత్వ పాఠశాలలలో చేర్చారు. మరియు అంగన్వాడీలోని ఫైవ్ ప్లస్ ఏజ్ గ్రూప్ విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్చుకోవడం జరిగినది.

# పూతలపట్టులో ఘనంగా గంగమ్మ జాతర

పూతలపట్టు స్వర్ణ సాగరం ఏప్రిల్ 19






పూతలపట్టులు లో ఘనంగా గంగమ్మ జాతర పూజలు నిర్వహించారు పి జగదీశ్వర్ రెడ్డి వంశపార పర్యాయంగా వారి కుటుంబ సమేతంగా గంగమ్మకు మొదటి పూజ ఘనంగా నిర్వహించారు పూతలపట్టు ప్రజలందరూ అతి వైభవంగా పూజలు చేశారు ఈ సందర్భంగా శ్రీ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గంగమ్మ జాతర చేయుట ముఖ్యఉద్దేశం. అందరూ పాడిపంటలతో సస్యశ్యామలంగా ఆరోగ్యంగా ఐక్యమత్యంతో జీవించాలని అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని ఈ గంగమ్మ జాతరను నిర్వహిస్తున్నామన్నారు ఈ జాతరకు పూతలపట్టు పుర ప్రజలందరూ ఐక్యమత్యంతో అమ్మ వారికి మొక్కుబడులుగా పూజల సమర్పించారు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో తమ భక్తిని చాటుకున్నారు వచ్చిన భక్తులందరికీ ప్రసాదాలు అందజేశారు మేళ తాళాలతో చక్కల భజనలతో ఈ జాతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు అమ్మ వారిని బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుండి ఊరేగింపుగా అతి వైభవంగా నిర్వహించబడనని జగదీశ్వర్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో పూతలపట్టు మరియు చుట్టుప్రక్కల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాల తల్లి ఒడి వంటిది

## తల్లి వలే బోధన -- తండ్రి వలే రక్షణ

## : ఎంఈవోలు ప్రేమలత, దయాకర్



స్వర్ణ సాగరం ఏర్పేడు :

ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు తల్లి ఒడి వంటివని, అక్కడ తల్లి వలే బోధనతో పాటు తండ్రి వలే రక్షణ కూడా లభిస్తుందని ఏర్పేడు ఎంఈవోలు ప్రేమలత, దయాకర్ పేర్కొన్నారు. మంగళవారం కందాడు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో "బడి పిలుస్తోంది" బడి ఈడు పిల్లల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలతో పాటు టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫాం, ఒక జత షూస్, రెండు జతల సాక్సులు, బెల్ట్, స్కూల్ బ్యాగ్, డిక్షనరీలతో కూడిన "సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర" కిట్లను ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు.అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా శుచికరమైన, రుచికరమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. "తల్లికి వందనం" పథకం కింద విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేల ఆర్థిక సహాయం జమ చేస్తున్నట్లు, రవాణా భత్యంగా నెలకు రూ.600 చొప్పున అందిస్తున్నట్లు పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కందాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధీర్, ఉపాధ్యాయులు శ్రీధర్ రావు, కృష్ణమూర్తి, సీఆర్పీ గురు ప్రసాద్ పాల్గొన్నారు.

# రోడ్డుపై విచ్చలవిడిగా ఆటోలు పట్టించుకోని అధికారులు



స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో రోడ్లపై విచ్చలవిడిగా ఆటోలు ఉండడంతో బస్సులు ఎక్కి ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు. అసలే మండుతున్న ఎండలు కారణంగా ఎక్కడ నిలబడుకోవాలన్నా ఆటోలు ఉండడం వలన ఇబ్బందిగా ఉన్నట్లు వారు తెలిపారు. ఆటో డ్రైవర్ లు ఆటోలను సీరియల్ ప్రకారం కాకుండా వారికి నచ్చినట్లుగా వ్యవహరిస్తున్నట్లు ప్రయాణికులు తెలిపారు. ప్రయాణం చేయాలన్నా చాలా కష్టంగా ఉన్నట్లు వారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆటోలను క్రమబద్ధంగా పెట్టుకునే విధంగా సహకరించాలని వారు కోరారు.

# సర్కారు బడుల బలోపేతానికి నడుం బిగించాలి

## ఎఏంఓ జి.సుధీర్ బాబు పిలుపు





మనుబోలు, స్వర్ణ సాగరం :

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అసిస్టెంట్ మోనిటరింగ్ ఆఫీసర్ జి.సుధీర్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం మనుబోలు జెడ్పీ బాలుర హైస్కూల్‌లోని పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రూమ్‌లో ఉన్న పుస్తకాల నిల్వలను, పంపిణీ రికార్డులను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ముందస్తు చర్యల కింద 10,000కు పైగా పాఠ్యపుస్తకాలను 11,000కు పైగా నోట్ పుస్తకాలను ఇప్పటికే సిద్ధం చేశామని తెలిపారు.పాఠశాలలు తెరిచే మొదటి రోజే ప్రతి విద్యార్థి చేతిలో 'రాధాకృష్ణ విద్య మిత్ర' కిట్ ఉండేలా స్పష్టమైన లక్ష్యంతో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.'పీఎం శ్రీ' పాఠశాలల్లో నాణ్యమైన విద్యా ప్రమాణాలను పెంపొందించడం కోసం 'పాల్' యాప్‌లను అందుబాటులోకి తెచ్చామని, రాబోయే రోజుల్లో ఈ డిజిటల్ విద్యా విధానాన్ని మరింత బలోపేతం చేస్తామని వివరించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.అమూల్య కుమారి, బి. విజయ లక్ష్మీ,సీఆర్పీలు ఎన్.జయరామ్, కె.స్వరూప, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఆదిశేషయ్య, డీవో రమేష్ రెడ్డి, కోటేశ్వరయ్య, షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# "కార్మికుల సేవలోనే పరమార్థం..

## కాగితాలపూరులో ఉపాధి కూలీల దాహం తీర్చిన తమ్ముడు చిట్టిబాబు!"

మనుబోలు, స్వర్ణ సాగరం :





ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావంతో ఎండ తీవ్రత రికార్డు స్థాయిలో నమోదవుతుండటంతో, ఎండ దెబ్బ నుంచి గ్రామీణ కార్మికులను రక్షించేందుకు పలు స్వచ్ఛంద కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. ఇందులో భాగంగా, మనుబోలు మండలం కాగితాలపూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చెల్లగిరి చిట్టిబాబు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.?ఈ సందర్భంగా చెల్లగిరి చిట్టిబాబు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రత్యేక హెచ్చరికలు, అలాగే సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.?"ఈ నెల 19వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కఠినమైన ఎండల్లో పనిచేసే ఉపాధి హామీ కూలీలు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకే ఈ మజ్జిగ పంపిణీ చేపట్టాం." అని తెలియజేసారు.??కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 24వ తేదీ వరకు ప్రతిరోజూ నిరంతరాయంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఎండల తీవ్రతను తట్టుకునేందుకు రోజుకో రకమైన పానీయాన్ని అందించనున్నట్లు వివరించారు.

**రాబోయే రోజుల్లో అందించే పానీయాలు**

రాగి జావ
చల్లటి షర్బత్
నిమ్మకాయ నీళ్లు

ఈ సేవా కార్యక్రమానికి అన్ని విధాలా సహకరించి, విజయవంతం చేసిన కాగితాలపూర్ గ్రామస్తులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# పదో తరగతి ఉత్తీర్ణత కానీ విద్యార్థులు అవగాహన





స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్ 30వ తేదీన విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత కానీ విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయుల వినోద్ స్థానిక ఉపాధ్యాయుల బృందముతో పదో తరగతి లో ఉత్తీర్ణత కాని విద్యార్థుల లను మంగళవారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పదో తరగతి లో ఉత్తీర్ణత కానీ విద్యార్థులకు పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించామ న్నారు. తరగతికి రాణి విద్యార్థులను వాళ్ళ ఇళ్లకు వెళ్లి ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థులను కచ్చితంగా తరగతులకు హాజరయ్యే విధంగా సహకరించాలని వారు తల్లిదండ్రులను కోరారు. తరగతికి రావడం వలన ఉపాధ్యాయులు పరీక్షకు అవసరమయ్యే ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని వారి కోరారు.

# బంధువుల మృతిచాయలో యువకుడి బలవన్మరణం,

## తంగేడు పాలెంలో విషాదం

## మానసిక వేదనతో ఉరివేసుకున్న మహేష్,

## అసహజ మరణంగా కేసు నమోదు చేసిన పోలీసులు,



స్వర్ణసాగరం –తొట్టంబేడు,

తంగేడు పాలెం గ్రామంలో కుటుంబ సభ్యుల వరుస మరణాల బాధను తట్టుకోలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బి.ఎన్. కండ్రిగ మండలం చల్లా మాంబపురం గ్రామానికి చెందిన శాంతల మహేష్ (23) ప్రస్తుతం తంగేడు పాలెంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ తన బావ బాలాజీ మృతి, అలాగే పుట్టిన వెంటనే మరణించిన మేనల్లుడు ఘటనలతో తీవ్ర మానసిక ఆవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో తరచూ మద్యం సేవిస్తూ మనోవేదనలో ఉండేవాడని కుటుంబ సభ్యులు వెల్లడించారు.మంగళవారం ఉదయం తన తల్లి శాంతల దీప వద్ద నుంచి రూ.50 తీసుకుని వెళ్లిన మహేష్, మధ్యాహ్నం సమయంలో తన పరిచయస్తుడు శ్రీనివాసులకు ఫోన్ చేసి "ఈ బాధను భరించలేకపోతున్నాను.. నేను చనిపోతాను" అంటూ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, పక్కింటి వారిని సమాచారం ఇవ్వగా, మహేష్ ఉంటున్న ఇంటి తలుపు లోపల నుంచి గడియ వేసి ఉండటాన్ని గుర్తించారు.స్థానికుల సహాయంతో తలుపు తెరిచి చూడగా, ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని మహేష్ వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతడిని కిందకు దించి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.కుటుంబ సభ్యుల మరణాలతో ఏర్పడిన మానసిక వేదనే ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఫిర్యాదు మేరకు అసహజ మరణం కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# మోదుగులపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం



స్వర్ణ సాగరం ఏర్పేడు :

ఏర్పేడు మండలం మోదుగులపాలెం పంచాయతీ ఎంఫీపీ స్కూల్‌లో అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్, తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు సహకారంతో నాగూర్ నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభమైంది.శిబిరంలో గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మురగప్ప మొదలియార్, సుబ్రమణ్యం మొదలియార్, జయచంద్ర, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు శిబిరాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# పోతిరెడ్డిపాళెం జలధార పరమేశ్వరునికి పవిత్ర సోమవార విశేష అభిషేకాలు

## పెన్నానది తీరాన వైభవంగా ఇష్టకామేశ్వరి సమేత జలధార పరమేశ్వర స్వామి పూజా కార్యక్రమాలు..

## ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు.

కోవూరు,స్వర్ణ సాగరం, మే 19:

ప్రముఖ శైవాలయమైన పోతిరెడ్డిపాళెం పవిత్ర పెన్నానది తీరాన వెలసిఉన్న శ్రీ ఇష్టకామేశ్వరి సమేత శ్రీ జలధార పరమేశ్వరస్వామి ఆలయంలో పవిత్ర సోమవారాన్ని పురస్కరించుకొని విశేష అభిషేకాలు, విశిష్ట అలంకరణ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు .ఈ విశేష పూజా కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఎం. వెంకటేశ్వరరావు, ఎన్. వెంకటరమణారెడ్డిలు వ్యవహరించారు. స్వామివారికి శాస్త్రోక్తంగా జరిగిన వివిధ రకాల అభిషేకాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్టీ కలికి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అలంకరణలు అత్యంత కంటికి ఇంపుగా నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో ఆలయ ట్రస్టీలు గాది రాజు భాస్కర్‌రావు, మునగా నాగేశ్వరరావు, జేఎల్ సత్యం, రాజా, పి. సుధాకర్ యాదవ్, రత్నయ్య, వెంకటసుబ్బయ్య, చెంగయ్య, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉభ యకర్తల ఆత్మీయులు, స్థానిక ప్రముఖులు, నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది.



# ప్రజా నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడు

## సీపీఎం మండల కార్యదర్శి దేవదానం

మనుబోలు, స్వర్ణ సాగరం:

భారత కమ్యూనిస్టు ఉద్యమ రథసారథి, నిరుపేదల ఆశాజ్యోతి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని సీపీఎం మండల కార్యదర్శి దేవదానం కొనియాడారు. మనుబోలు,గ్రామంలో సీపీఎం, ఆటో కార్మికుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.?ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.అనంతరం దేవదానం మాట్లాడుతూ.. సుందరయ్య జీవిత విశేషాలను, ఆయన చేసిన ప్రజా పోరాటాలను గుర్తుచేసుకున్నారు.

**కుల వివక్షపై చిన్ననాటే తిరుగుబాటు**

? 1913లో నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో జన్మించిన సుందరయ్య , విద్యార్థి దశ నుంచే సమాజంలోని అసమానతలపై తిరుగుబాటు చేశారు. సమాజంలో వేరూనుకున్న కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. హరిజనులు, గిరిజనుల పట్ల ఎంతో ఆప్యాయతను కనబరుస్తూ, ఆ రోజుల్లోనే గ్రామంలో సహబంతి భోజనాలు



ఏర్పాటు చేసి కుల నిర్మూలనకు గట్టి పునాది వేశారు.పేదల కోసం వైద్య సేవలు

?సుందరయ్య సోదరుడు డాక్టర్ రామచంద్రారెడ్డి సైతం అన్న అడుగుజాడల్లోనే నడిచారని దేవదానం గుర్తుచేశారు. వైద్య విద్యనభ్యసించిన అనంతరం ఆయన నెల్లూరులో 'రామచంద్రారెడ్డి హాస్పిటల్'ను స్థాపించి, అత్యంత తక్కువ ఫీజులతో నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ?"సుందరయ్య పార్లమెంటు సభ్యుడిగా (ఎంపీ) ఎన్నికైనప్పటికీ, తన నిరాడంబరతను వీడలేదు. ఢిల్లీలో సైకిల్‌పైనే పార్లమెంట్‌కు వెళ్లేవారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తి, ప్రభుత్వం ప్రజోపయోగకరమైన నిర్ణయాలు తీసుకునేలా అనేక సూచనలు, సలహాలు ఇచ్చి పాలకుల చేత సైతం శభాష్ అనిపించుకున్నారు." అని అన్నారు.?చివరి శ్వాస వరకు నిరుపేదల పక్షాన, సీపీఎం పార్టీ పక్షాన నిలిచి నికరంగా పనిచేసిన మహనీయుడు ఆయన అని నాయకులు స్మరించుకున్నారు. అలాంటి మహనీయుడి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి ఆదిశేషయ్య,ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, సుబ్బారావు, పెంచలయ్య సీపీఎం నాయకులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధిపై మాట్లాడే అర్హత వైసిపికి లేదు ! రఫీ

## మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య అడ్డగోలు అబద్ధాలు టీడీపీ నాయుడుపేట టౌన్ ప్రెసిడెంట్ 786 రఫీ నిప్పులు

## ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పై అసత్య ఆరోపణలు చేస్తే తగదు ! తెదేపా రఫీ.

## ఐదేళ్ల వైసిపి పాలనలో నియోజకవర్గాన్ని అధోగతి పాలు చేశారు ! ఇప్పుడు నీతులు చెబుతారా



స్వర్ణ సాగరం,సూళ్లూరుపేట మే 19 :

కూటమి ప్రభుత్వం సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ పై మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేసిన నిరాధారమైన ఆరోపణలపై స్పందించిన టీడీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు 786 రఫీ తీవ్రంగా ఖండించారు.మంగళవారం నాయుడుపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వైసిపి నేతలపై నిప్పులు చెరిగారు.సంజీవయ్య చేసిన విమర్శలకు పక్కా ఆధారాలతో కౌంటర్ ఇచ్చారు.అభివృద్ధిని అడ్డుకుంది వైసిపి కాదా?గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు,సొంత పార్టీ కార్యకర్తలను పక్కనపెట్టి ఆయనకి కొమ్ము కోసే వారికి ప్రోత్సాహిస్తూ ప్రజ సమస్యలను సంజీవయ్య గాలికి వదిలేసి ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురిచేసి అడ్డగోలుగా అనేక అక్రమలకు అన్యాయాలకు పాల్పడింది సంజీవయ్య అంటూ నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు 786 రఫీ మండిపడ్డారు.నాడు అధికారంలో ఉండి నియోజకవర్గాన్ని అధోగతి పాలు చేసి వైసిపి కాదా అని ప్రశ్నించారు.నేడు ప్రజల కోసం అహర్నిశలుగా శ్రమిస్తున్న కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే విజయశ్రీ ప్రజాధరణ చూసి ఓర్వలైనితనంతో ఇంకా ఎందుకు ప్రజలోకి తప్పుడు ప్రచారాలు పంపిస్తూ అమాయక ప్రజలను ఇంకా ఎంత నమ్మకద్రోహం చేస్తావు సంజీవయ్య నీకు మాట్లాడే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు.కేవలం రాజకీయ ఉనికిని చాటుకోవడం కోసమే సంజీవయ్య ఇలాంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు.

**ఎమ్మెల్యే విజయశ్రీ పై ఆరోపణలు చేస్తే సహించం**

ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నియోజకవర్గ అభివృద్ధికి,ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తున్నారని రఫీ కొనియాడారు.వైసిపి చేసిన అప్పులు,సృష్టించిన అవరోధాలను అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని చెప్పారు.ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య తన అబద్ధపు ప్రచారాన్ని మానుకోవాలని,లేనిపక్షంలో ప్రజలే వైసిపికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వానికి సంబంధించిన పలువురు సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఆశ వర్కర్లకు నిర్బంధ సబ్ సెంటర్ డ్యూటీలను రద్దు చేయాలి

## – ఐ.ఎఫ్.టి.యు డిమాండ్



స్వర్ణ సాగరం నాగలాపురం మే 19:

నాగలాపురం పట్టణంలోని ధర్మరాజుల ఆలయం ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీల ఆశ వర్కర్ల యూనియన్ జి.గీత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఐ.ఎఫ్.టి.యు జిల్లా నాయకులు దేశాండి అరుణాచలం, మురుగేషన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లు స్వచ్ఛందంగా సేవ చేస్తూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న బాలింతలకు, పసిపిల్లలకు సామాన్య ప్రజల ఆరోగ్యాల కోసం నిరంతరం శ్రమిస్తూ ఉంటే ప్రభుత్వం వాళ్లకు కనీస వేతనాలు ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.గత కొంతకాలంగా సబ్ సెంటర్లో నిర్బంధంగా డ్యూటీలు చేయించడం వల్ల స్థానిక బాధితులకి అందుబాటులో లేకుండా పోయే అవకాశం ఉందని గర్భనిలను సకాలంలో హాస్పిటల్ కి తీసుకు పోలేక ఇబ్బందులు పడుతున్నారని పైగా సబ్ సెంటర్ డ్యూటీ చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా వేతనాలు ఇవ్వడం లేదని విమర్శలు చేశారు.మురుగేషన్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఎన్సీడీసీ సర్వేలకు ఉపయోగించవద్దని వ్యాక్సిన్ బాక్సు మోయరాదని తెలియ జేశారు. సందర్భంగా స్థానిక నాగలాపురం ధర్మరాజు గుడి సెంటర్ వద్ద ఆశ వర్కర్ల పీహెచ్సీ లో ఐఎఫ్టియు కమిటీ సమావేశం జరిగిందని తెలియజేశారు 12 మంది ఆశా వర్కర్లతో నూతన ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీల ఆశా వర్కర్ల సమాఖ్య సమావేశం జరిగినది కన్వీనర్గా జె.లతా ను ఏకగ్రీవంగా ఎన్నుకునరు తెలియజేశారు.ఈ సమావేశంలో ఇఫ్ట్ నాయకుడు దక్షణ మూర్తి ఆశ గీత ముని లక్ష్మి రూతు లతా కిరుభ జయ కోకిల ధన మీనా తదితరులు పాల్గొన్నారు.



# స్పిరిట్‌లో సైలెంట్ వార్?

దేశవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ నిర్మాణం జరుపుకుంటున్న పానిండియా చిత్రాల్లో ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం ముందు వరుసలో ఉంటుంది. ఈ ప్రెస్టేజియస్ మూవీ కోసం అభిమానులే కాదు, సగటు ప్రేక్షకులు సైతం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. పూర్తి కాప్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మునుపెన్నడూ చూడనటువంటి రూత్‌లెస్ పోలీస్ అవతారంలో ప్రభాస్ కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. పోలీస్‌స్టేషన్‌కి సంబంధించిన ఎపిసోడ్‌ని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కిస్తున్నట్లు ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ ఎపిసోడ్‌లో యాక్షన్ కంటే సైలెన్స్‌తోనే సందీప్ భయపెట్టనున్నారట. ఆద్యంతం సీరియస్ డ్రామాగా ఈ సీక్వెన్స్ సాగుతుందని వినికిడి. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఓబెరాయ్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరి మధ్య నడిచే వార్ డ్రామా ఉత్కంఠభరితంగా ఉంటుందట. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న గ్రాండ్‌గా విడుదల కానున్నది.




# 'డ్రాగన్' గ్లింప్స్ రిలీజ్.. ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కి పవర్‌ఫుల్ ట్రీట్

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూ.ఎన్టీఆర్ హీరోగా, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమా గ్లింప్స్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. మే 20వ తేదీ జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ మొత్తం సినిమా కంటెంట్ ఎలా ఉండబోతోందనే క్లారిటీ ఇచ్చేసినట్లు అయింది. 'సలార్', 'కేజీఎఫ్' లాంటి భారీ సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంత్ నీల్, తన మార్క్ ఏమాత్రం తగ్గకుండానే ఈ గ్లింప్స్ కట్ చేశాడు. ఇక తారక్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రాత్రి 11.30 గంటల తర్వాత డ్రాగన్ సినిమా గ్లింప్స్ వచ్చింది. 4.28 నిమిషాల నిడివి గల ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ స్లిమ్ లుక్ ఆకట్టుకుంది. సింపుల్‌గా సినిమా కథ, ఆ ప్రపంచంలోని పాత్రలను పరిచయం చేశారు. ఈ గ్లింప్స్‌లో తారక్ చెప్పిన డైలాగ్స్ అభిమానులను అలరించేలా ఉన్నాయి. విజువల్స్ చాలా రిచ్‌గా ఉన్నాయి. రవి బస్రూర్ అందించిన నేపథ్య సంగీతం ఫ్యాన్స్ అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. పవర్‌ఫుల్‌గా సాగిన ఈ గ్లింప్స్ సినిమా మీద భారీ అంచనాలను రేపుతోంది. కాగా డ్రాగన్ సినిమా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కానీ షూటింగ్ షెడ్యూల్‌లు వరుసగా వాయిదాలు పడటంతో విడుదలను వాయిదాలు పడ్డ విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానున్నట్టు డ్రాగన్ టీమ్ అధికారికంగా ప్రకటించింది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు కీలకమైన పాత్రలో అనిల్ కపూర్ నటిస్తున్నారు. కథను మలుపు తిప్పే మరో లీడ్ రోల్‌లో నటించనున్నారంటూ శ్రుతీహాసన్, రష్మికా మందన్నా, కాజోల్... వంటి వార్ల పేర్లు వినిపించాయి. తాజాగా ఆలియా భట్ పేరు తెరపైకి వచ్చింది. కాగా.. ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ యేర్నెని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా విడుదల చేసిన వీడియో గ్లింప్స్‌ను మీరు కూడా చూసేయండి.

# గ్రామీణ నేపథ్యంలో హైలెస్సో

సుడిగాలి సుధీర్‌గా పేరుపొందిన సుధీర్ ఆనంద్ కథానాయకుడిగా రూపొందుతున్న ఎమోషనల్ డ్రామా 'హైలెస్సో'. ప్రసన్నకుమార్ కోట దర్శకుడు. శివ చెర్రీ, రవికిరణ్ నిర్మాతలు. ప్రముఖ నటుడు శివాజీ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తుండటం విశేషం. మంగళవారం సుధీర్ పుట్టినరోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రఫ్ లుక్‌లో, గంటలు కట్టిన ఖడ్గాన్ని చేతపట్టుకొని రక్తపు మరకలతో పవర్‌ఫుల్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న సుడిగాలి సుధీర్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బలమైన ఎమోషన్స్ కూడా ఉంటాయని, సుధీర్ ఇప్పటివరకూ చేసిన పాత్రలకు పూర్తిభిన్నమైన పాత్రను ఇందులో పోషిస్తున్నారని, ఇప్పటికే హైదరాబాద్‌లో 25రోజుల షెడ్యూల్ పూర్తయిందని, త్వరలోనే ఏలూరులో 40రోజల భారీ షెడ్యూల్ ప్రారంభం కానున్నదని మేకర్స్ తెలిపారు. నటాషా సింగ్, నక్షా సరన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నటి అక్షర గౌడ కీలక పాత్ర పోషిస్తు న్నది. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, నిర్మాణం: వజ్ర వరాహి. సినిమాస్.



# నటనకు భాష ముఖ్యం

మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సేకి సరైన విజయాలు లేకపోయినా.. సరైన అవకాశాలు మాత్రం తలుపుతడుతూనేవున్నాయి. తమిళంలో శివకార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడింది. 'ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అయితే.. ఈ కథలో నా పాత్ర కీలకమని మాత్రం చెప్పగలను. నన్ను ఉత్తమనటిగా ప్రేక్షకుల ముందు నిలబెట్టే పాత్ర ఇది. అందులో సందేహం లేదు. ఏదైనా పాత్ర చేస్తున్నప్పుడు ఆ పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భాష చాలా ముఖ్యం. కథలోని భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా నటిస్తే, అది నిరర్థకమే. అందుకే.. నిజాయితీగా ముందు భాష తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'కింగ్‌డమ్' సినిమా నటించేటప్పుడు నా పాత్ర కోసం తెలుగు నేర్చుకొని, డబ్బింగ్ కూడా నేనే చెప్పుకున్నా. అదే విధంగా త్వరలో 'సెయాన్' కోసం తమిళం నేర్చుకొని, నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతా' అని పేర్కొన్నది భాగ్యశ్రీ బోర్సే.







# వేసవి నాటి జ్ఞాపకాల్లో..

చిన్ననాటి అందమైన జ్ఞాపకాలను గుర్తుకు తెస్తూ వినోదప్రధానంగా రూపొందిస్తున్న బాలల చిత్రం 'సమ్మర్ హాలీడేస్'. మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీకర్ దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం బాలనటి, 'మనశంకర వరప్రసాద్‌గారు' ఫేమ్ ఖుషి పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రతి ఒక్కరికి వేసవి సెలవుల్లోని బాల్య జ్ఞాపకాలను గుర్తుకు తెస్తూ ఆద్యంతం నాస్టాల్జిక్ ఫీల్‌తో సాగే సినిమా ఇదని, చక్కటి వినోదంతో అలరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సింజిత్ యెర్రమల్లి, నిర్మాణ సంస్థ: ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్, కథ, దర్శకత్వం: శ్రీకర్.